బిజెపి, కాంగ్రెస్‌లకు ఇసి నోటీసులు

- కోడ్ ఉల్లంఘించొద్దని స్టార్ క్యాంపెయినర్లను ఆదేశించండి

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 288 | విజయవాడ, గురువారం 23 మే 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 23 May 2024 | Rs

క్వాలిఫయర్ రౌండ్‌కు రాజస్థాన్

- బెంగళూరుపై నాలుగు వికెట్ల తేడాతో గెలుపు
- ఫైనల్ బెర్త్‌కు రేపు సన్‌రైజర్స్‌తో ఢీ



6

పరారీలో ఎమ్మెల్యే పిన్నెల్లి

- లుక్ అవుట్ నోటీసులు జారీ
- తెలంగాణా, ఎపి పోలీసుల ఉమ్మడి గాలింపు
- అరెస్ట్ వదంతులతో మాచర్లలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-యంత్రాంగం

ఇవిఎం ధ్వంసం చేస్తూ వెబ్ కెమెరాకు చిక్కిన మాచర్ల ఎంఎల్‌ఎ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరారీలో ఉన్నారు. బుధవారం రాత్రి పది గంటల వరకు ఆయన ఆచూకీ దొరకలేదు. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఉమ్మడిగా ఆయన కోసం గాలిస్తున్నారు. అంతకుముందు సంగారెడ్డి జిల్లాలో ఆయన పోలీసులకు దొరికారని, ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు రహస్యప్రాంతానికి తరలించి విచారిస్తున్నారని వార్తలు వచ్చాయి. దీంతో మాచర్లలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్నం నుంచి మాచర్ల, రెంటచింతల, కారంపూడి, పాలవాయి ప్రధాన రహదారుల వెంట ఉన్న దుకాణాలు, షాపులను మూసివేశారు. అయితే, తమకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దొరకలేదని, ఆయన వాహనాలను, కొందరు అనుచరులను అదుపులోకి తీసుకున్నామని సంగారెడ్డి పోలీసులు ప్రకటించారు.

మాచర్లలో దుకాణాలు మూసివేసి, పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

విదేశాలకు వెళ్లేందుకు యత్నం

మంగళవారం నుండు అజ్ఞాతంలో ఉన్న పిన్నెల్లి విదేశాలకు పారిపోయే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యేంతవరకు అరెస్ట్ కాకూడదని ఆయన భావించినట్లు చెబుతున్నారు. ఈ విషయమై పక్కా సమాచారం అందడంతో బుధవారం ఉదయమే రాష్ట్ర పోలీసులు ఆయనపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్, చెన్నయ్, బెంగుళూరు, ముంబాయి తదితర విమానాశ్రయాలను అలెర్ట్ చేశారు. అలాగే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్ట్ చేసేందుకు అడిషనల్ ఎస్‌పి స్థాయి అధికారులతో ఏడు మిగతా 2లో

అదానీ బొగ్గు కుంభకోణం

- తక్కువ గ్రేడ్ సరఫరాతో భారీ మోసం
- రూ.3 వేల కోట్లకు పైగా మేత
- ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు తీవ్ర నష్టం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అప్తమిత్రుడిగా గుర్తింపు పొందిన కుబేరుడు గౌతం అదానీ బొగ్గు కుంభకోణానికి పాల్పడుతున్నారు. తక్కువ గ్రేడ్ బొగ్గును అధిక విలువగా చూపిస్తూ విక్రయిస్తున్నారని ఫైనాన్సియల్ టైమ్స్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. నాసిరకం బొగ్గుతో ప్రభుత్వ రంగ విద్యుత్ కంపెనీలను మోసం చేస్తున్నారని తెలిపింది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరెప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) నుంచి పొందిన డాక్యూమెంట్ల పరిశీలన ఆధారంగా చేసుకుని ఫైనాన్సియల్ టైమ్స్ (ఎఫ్‌టి) ఈ కథనం ప్రచురించింది. నాసిరకం బొగ్గును సరఫరా చేయడం ద్వారా అదానీ భారీ లాభాలను ఆర్జిస్తున్నారు. ఈ వ్యవహారంలో అదానీ రూ.మూడు వేల కోట్లకు పైగా అనుచిత లబ్ది పొందారు. తక్కువ గ్రేడ్ బొగ్గును విద్యుత్ కోసం ఉపయోగించడం అంటే ఎక్కువ ఇంధనాన్ని కాల్చడం ద్వారా గాలి నాణ్యతను పణంగా పెడుతున్నారు. మరోవైపు అదానీ మోసపూరితంగా బంపర్ లాభాలను పొందుతున్నారు.

జనవరి 2014లో అదానీ ఒక కిలోగ్రాముకు 3,500 కేలరీలు కలిగి ఉన్న ఇండోనేషియా బొగ్గును కొనుగోలు చేసినట్లు ఇన్‌వాయిస్‌లు చూపిస్తున్నాయి. అదే షిప్‌మెంట్‌ను తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టాంగెడ్‌కో)కి 6,000 కేలరీల బొగ్గుగా విక్రయించారు. ఇది అత్యంత విలువైన గ్రేడ్‌లలో ఒకటి. రవాణా ఖర్చుల తర్వాత అదానీ తన ధరను ఈ ప్రక్రియలో రెండింతలు పెంచినట్లు స్పష్టమవుతోంది. దీన్ని రుజువు చేయడానికి 2014లోని 22 షిప్‌మెంట్‌ల డాక్యూమెంటేషన్‌లను సరిపోల్చినట్లు ఫైనాన్సియల్ టైమ్స్ తెలిపింది.

ఇండోనేషియాలోని తక్కువ కాలరీల ఉత్పత్తికి పేరుగాంచిన మైనింగ్ గ్రూప్ నుండి అదానీ బొగ్గును కొనుగోలు చేశారు. దీన్ని దక్షిణాదిలోని ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలకు ఖరీదైన బొగ్గుగా సరఫరా చేసింది. దీంతో విద్యుత్ సంస్థలు నష్టపోవడమే కాకుండా.. ఈ బొగ్గుతో వెలుపడిన కాలుష్యంతో లక్షలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. "విద్యుత్ రంగ ప్రయోజనాలకు అనుకూలంగా ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు." అని న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్‌లోని విశ్లేషకుడు సునీల్ దహియా అన్నారు.

2021-2023 మధ్యకాలంలో మార్కెట్ ధరలకు మించి భారత్‌కు దిగుమతి చేసుకున్న బొగ్గు కోసం మధ్యవర్తులకు 5 బిలియన్ డాలర్ల (రూ.45వేల కోట్లు)కు పైగా చెల్లించినట్లు నివేదికలు రావడంతో ప్రతిపక్ష పార్టీలు అదానీపై విచారణకు డిమాండ్ చేసిన విషయాన్ని ఫైనాన్సియల్ టైమ్స్ గుర్తు చేసింది. ఆర్థిక నేరాల పరిశోధనాత్మక విభాగం అయిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) 2016లో బొగ్గు ధరలపై విచారణ ప్రారంభించింది. బొగ్గు ధరలను 68 మిలియన్ డాలర్ల మిగతా 5లో

'ఇండియా' అధికారంలోకి వస్తే

మోదానీ మెగా స్కామ్‌పై జెపిసి దర్యాప్తు

- కాంగ్రెస్ హామీ

5

Dr. YSR Aarogyasri Health Care Trust
Government of Andhra Pradesh
Ayushman Bharat Pradhan Mantri Jan Arogya Yojana

ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.203 కోట్లు విడుదల

3

కొనసాగుతున్న కార్డన్ సెర్చ్

- 803 వాహనాలు సీజ్ : డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తప్పవని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా హెచ్చరించారు. పోలింగ్‌కు ముందు పోలింగ్ తర్వాత రాష్ట్రంలో పెద్దయెత్తున హింస చెలరేగడంతో కౌంటింగ్ నాటికి శాంతిభద్రతలను అదుపులో వుంచేందుకు పోలీస్‌శాఖ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం రెండో రోజు బుధవారం నాడు 168 సమస్యాత్మక ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో ఎలాంటి పత్రాలు లేని 803 వాహనాలను సీజ్ చేశారు. అలాగే 185 లీటర్ల ఐడి లిక్కర్, 18.94 లీటర్ల నాన్ డ్యూటీ లిక్కర్, 130 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో మొత్తం 14

మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ తనిఖీల్లో మరో నలుగురి కి 41 సిఆర్‌పిసి కింద నోటీసులిచ్చారు. ఈ మేరకు కార్డన్ సెర్చ్‌పై డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ కు ప్రజలు సహకరించాలని, ఎక్కడైనా అనుమానస్పదంగా వుంటే 112కు, 100కు డయల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రానికి వాయు'గండం'!

- మత్స్యకారులు వేటకెళ్లొద్దు
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరాలకు ఆనుకుని నైరుతి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తేలికపాటినుండి ఒకమోస్తరు వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని తెలిపారు. బుధవారం సాయంత్రానికి అల్పపీడనం ఈశాన్యదిశగా కదులుతోందని, ఇలాగే ప్రయాణించి శుక్రవారం నాటికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో గురువారం అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. శుక్రవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువులు, గొర్రెల కాపరులు చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో వుండకూడదన్నారు.

బంగ్లాదేశ్ ఎంపి హత్య

- కొల్‌కతాలో ముగ్గురు అరెస్టు

ఢాకా : భారత్‌లో ఆచూకీ తెలియకుండా పోయిన బంగ్లాదేశీ అవామీలీగ్ పార్టీ ఎంపి అన్వరుల్ అజీమ్ అనర్ కోల్‌కతాలో ఒక ఫ్లాట్‌లో హత్యకు గురైనట్లు హోం మంత్రి అసదుజ్‌మాన్ ఖాన్ బుధవారం ప్రకటించారు. ఇందుకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశామని తెలిపారు. ఖాన్ మీడియాతో మాట్లాడుతూ.. హంతకులందరూ బంగ్లాదేశీయులేనని తెలుస్తోందన్నారు. ఇది ఒక పథకం ప్రకారం జరిగిన హత్య అని పేర్కొన్నారు. కొల్‌కతాలోని తన ఫ్లాట్‌లో రక్తపుమరకలు కనిపించాయని, బహుశా అయనను అక్కడ చంపి, బాడీని ఎక్కడో విసిరేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఎంపి మృతదేహం కోసం గాలింపు ముమ్మరంగా సాగుతోందని మంత్రి తెలిపారు. అన్వరుల్ ఈ నెల 12న చికిత్స కోసం భారత్‌కు వచ్చారు. 18న ఉత్తర కోల్‌కతాలో బారానగర్ పోలీసు స్టేషన్‌లో ఆయన అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. అన్వరుల్ హత్యపై ప్రధాని షేక్ హసీనా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

వియత్నాం అధ్యక్షుడిగా తో లామ్

హనోయి : వియత్నాం సోషలిస్టు రిపబ్లిక్ కొత్త అధ్యక్షుడిగా వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు తో లామ్ బుధవారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, వియత్నాం శతాబ్ది లక్ష్యాలని సాధించేందుకు శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని, రాజ్యాంగం ద్వారా దఖలుపడిన అధికారాలను వియత్నాం ప్రజల అభ్యున్నతి కోసం వినియోగిస్తానని చెప్పారు. .అంతకుముందు వియత్నాం నేషనల్ అసెంబ్లీ (పార్ల మెంటు) 67 ఏళ్ల తో లామ్‌ను కొత్త అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మొత్తం 473 మంది డిప్యూటీలు (ప్రతినిధులు)కుగాను 472 మంది హాజరైన ఈ సమావేశంలో దేశాధ్యక్ష పదవికి లామ్ పేరును ప్రతిపాదిస్తూ పార్లమెంటు సెక్రటరీ జనరల్ బుయివాన్ కువాంగ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ ఏడాది మార్చిలో వో వాన్ తాంగ్ రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. లామ్ 2026 వరకు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. ప్రతి అయిదేళ్లకొకసారి జరిగే వియత్నాం కమ్యూనిస్టు పార్టీ మహాసభ 2021లో ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుంది. లామ్ నాలుగు దశాబ్దాల పాటు ప్రజా భద్రతా వ్యవహారాల ఉప మంత్రిగా పనిచేశారు. రెండు పర్యాయాలు పార్టీ పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. 2016లో మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం వియత్నాం పోలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎదిగారు.

బుధవారం ప్రమాణస్వీకారం చేస్తున్న తో లామ్

జులై4న బ్రిటన్ ఎన్నికలు

- సునాక్ ప్రకటన

లండన్: పద్నాలుగేళ్ల కన్సర్వేటివ్ ప్రభుత్వం ఓటమి ఖాయమని ఒపీనియన్ పోల్స్‌తో సహా అందరూ భావిస్తున్న నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ (44) అకస్మాత్తుగా ముందస్తు ఎన్నికలకు వెళ్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంటు రద్దుకు రాజు ఆమోదం తెలిపారని, జులై 4న పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయని బుధవారం నంబర్ టెన్ డౌనింగ్ స్ట్రీట్ వెలుపల నిలబడి ఆయన వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు వర్షాకాలంలో జరుగుతాయని ఇంతవరకు చెబుతూ వచ్చిన సునాక్ ఆకస్మికంగా ఈ ముందస్తుకు వెళ్లడంలో ఆంతర్యం తెలియనిదేమీ కాదు. ముందస్తు ఎన్నికలతో ఆయన జూదమాడుతున్నారని విశ్లేషకులు పలువురు పేర్కొంటున్నారు. పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు బాహాటంగా సునాక్ ప్రభుత్వం మద్దతు పలకడం, రష్యాను దెబ్బతీయడం కోసం ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎగదోస్తుండడం, అమెరికాతో కలిసి సామ్రాజ్యవాద ఆధిపత్య యుద్ధాల్లో పాల్గొనడం వంటి విధానాల పట్ల, అలాగే దేశీయంగా సామాన్యులపై భారాలు మోపి, సంపన్నులకు రాయితీలు ఇవ్వడం, ప్రభుత్వ రంగంలోని రైల్వేలను, ప్రజారోగ్య రంగాన్ని ప్రైవేటీకరించే యత్నాలపైన బ్రిటన్ ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. గత నాలుగేళ్లలో నల్గురు ప్రధానులు మారడం బ్రిటన్‌లో నెలకొన్న రాజకీయ అస్థిరతను తెలియజేస్తోంది. సునాక్ మాత్రం తన ప్రభుత్వం ఆర్థిక సుస్థిరతకు మొదటి ప్రాధాన్యత ఇచ్చిందని, కోవిడ్-19 సమయంలో చీకట్లో వున్న ప్రజలను ఆదుకునేందుకు చేతనైనంత సాయం చేశామని చెప్పుకొచ్చారు. రుణ భారాన్ని అదుపు చేశామని, ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేశామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షమైన లేబర్ పార్టీ నమ్మదగినది కాదని విమర్శించారు. ఇటీవల నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో లేబర్ పార్టీ కన్నా కన్సర్వేటివ్ పార్టీ (వీరిని టోరీలని కూడా పిలుస్తారు) 20 పాయింట్లు వెనకబడి ఉన్నట్లు వెల్లడైంది.బ్యాంకర్‌గా, గతంలో బ్యాంకర్‌గా, ఆర్థిక మంత్రిగా పనిచేసిన సునాక్ పాలనపై ప్రజలు విసిగిపోయి ఉన్నారు. ఎన్నికల ప్రచారానికి పట్టుమని ఆరు వారాల వ్యవధి కూడా లేకపోవడంతో ఇప్పటి నుంచే రెండు ప్రధాన పార్టీలు ప్రచారం మొదలెట్టాయి.

గుంటూరులో రియల్టర్ దారుణ హత్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారి బుధవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. ఆర్థికపరమైన లావాదేవీలే ఈ హత్యకు కారణమని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధి సంజీవయ్యనగర్ 2వ లైనులో రియల్ ఎస్టేట్ వ్యాపారి కంచర్ల దేవనందం నివశిస్తున్నారు. గతకొంతకాలంగా ఆయన గుంటూరుకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో తిరిగి గుంటూరుకు వచ్చారు. ప్రకాశం జిల్లా కురిచేడుకు చెందిన తమ సమీప బంధువులతో దేవనందంకు ఆర్థికపరమైన వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మద్యం సేవించేందుకు కొందరు యువకులు బుధవారం రాత్రి ఆయనను పిలించారు. అనంతరం ఇంటి వద్ద వదిలిపెడతామని చెప్పి మార్గమధ్యంలో కత్తులతో దాడి చేశారు. దీంతో దేవనందం అక్కడికక్కడే మరణించారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆర్థిక పరమైన లావాదేవీలే హత్యకు కారణమని పోలీసులు తెలిపారు.

రైలు నుంచి విడిపోయిన బోగీలు

జన్మభూమికి తప్పిన ముప్పు

- ఎం-1, డి-1 మధ్య తెగిన లింక్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

విశాఖపట్నం-లింగంపల్లి జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12805)లోని ఎం-1, డి-1 కోచ్‌లలో సాంకేతిక లోపం తలెత్తడంతో రైలు బయలుదేరిన కొద్దిసేపటికే రెండుగా విడిపోయింది. విశాఖపట్నం నుంచి లింగంపల్లికి బుధవారం ఉదయం 6.20 గంటలకు బయలుదేరిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కొద్దిసేపటికే సాంకేతిక సమస్య కారణంగా ఎసి బోగీ ఎం-1, సెకండ్ సిట్టింగ్ బోగీ డి-1 కోచ్‌ల మధ్య లింక్ తెగిపోయింది. ఆ సమయంలో రైలు నెమ్మదిగా వెళ్తుండడంతో పెను ప్రమాదం తప్పింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే రైలును స్టేషన్‌కు తీసుకొచ్చి మరమ్మత్తులు చేపట్టారు. మరమత్తుల అనంతరం 9.37 గంటలకు విశాఖపట్నం నుంచి రైలు బయలుదేరింది.

విద్యుత్ కనెక్షన్ కప్లర్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఈ సంఘటన జరిగిందని, రెండు కోచ్‌లను మార్చి పంపించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మూడు గంటల 17 నిమిషాలు ఆలస్యంగా నడుస్తోంది.

మత విద్వేషాగ్నికి 'మెటా' ఆజ్యం

- ముస్లింలపై విద్వేష ప్రసంగాలకు ఆమోదం
- మోడీపై విమర్శనాత్మక ప్రకటనలకు నిరాకరణ

లోపలి పేజీలో..

పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

టిడిపి కార్యకర్తకు చంద్రబాబు పరామర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేటు పోలింగ్‌స్టేషన్ ఘటనలో ఇవిఎం ధ్వంసం ఘటనకు అడ్డుపడ్డ టిడిపి కార్యకర్త నంబూరి శేషగిరిరావును ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఫోన్‌లో పరామర్శించారు. విదేశీ పర్యటనలో ఉన్న చంద్రబాబు శేషగిరిరావు ఆరోగ్య పరిస్థితిపై బుధవారం ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఇవిఎంను ధ్వంసం చేసిన ఎమ్మెల్యేను ధైర్యంగా ప్రశ్నించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై కేసు నమోదు కావడంతో అజ్ఞాతం వీడి శేషగిరి బయటకు వచ్చారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అక్రమాలను ప్రశ్నించిన పోరాటం, ధైర్యంపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయని శేషగిరిరావును అభినందించారు.

రేపటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదోతరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ ఒకటి వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 5,03,459 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 3,65,872 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,37,587 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు నిర్వహించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 861 పరీక్ష కేంద్రాలను బోర్డు ఏర్పాటు చేసింది. వీటిల్లో 37 సమస్యాత్మక కేంద్రాలున్నాయి.

– జూన్ 3 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 1,61,877 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 96,938 మంది బాలురు, 64,939 మంది బాలికలు ఉన్నారు. పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే ఏర్పాటు చేసింది. మొత్తం 685 పరీక్ష కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులను ఉదయం 8:45 నుంచి 9:30 గంటల్లోపే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతినిస్తారు. హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల విభాగం ఇప్పటికే విడుదల చేసింది. 685 చీఫ్ సూపరింటెండెంట్స్, 685 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, 6,900 మంది ఇన్విజిలేటర్లు, 86 మంది ఫ్లైంగ్ స్క్వాడ్స్‌ను నియమించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పురుగుల మందు తాగి తల్లీకూతురు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ఇబ్బందులు.. భూ తగాదాలు ఓ కుటుంబంలో విషాదాన్ని నింపాయి. పురుగుల మందు తాగి తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్ జోగులాంబ గద్వాల జిల్లా మానపాడు మండలం పరిధిలోని బూడిదపాడు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బూడిదపాడు గ్రామానికి చెందిన నర్సింహులు అన్నదమ్ముల మధ్య చాలా కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. గొడవలతో విసిగిపోయిన నర్సింహులు భార్య వరలక్ష్మి, కుమార్తె అనురాధ మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకెళ్లారు. కుటుంబీకులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స అందించేలోపే ఇద్దరూ మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. అయితే, కూతురు, కొడుకు చదువు కోసం, పెండ్లి కోసం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని, వారసత్వంగా వచ్చిన భూములు సీలింగ్‌లో ఉండటంతో ఎవరూ కొనేందుకు ముందుకు రావడం లేదని అన్నదమ్ములకు విజ్ఞప్తి చేశారు. అయినా వివాదం సమసిపోలేదు. దాంతో తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్నట్టు స్థానికులు తెలిపారు.

విద్యార్థులు దేశం కోసం పనిచేయాలి

విక్రమ సింహపురి వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

విద్యార్థులందరూ జీవితంలో నైతిక విలువలు పాటిస్తూ దేశం కోసం పని చేయాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ 8, 9 స్నాతకోత్సవ వేడుకల్లో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రక్షణ మంత్రిత్వ శాఖ సైంటిఫిక్ అడ్వయిజర్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, ఉన్నతవిద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇఎన్‌టి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఇసి వినయ్‌కుమార్‌కు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ నుంచి గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ ప్రదానం చేశారు. అనంతరం గాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, రీసెర్చ్ స్కాలర్లకు డిగ్రీ పట్టాలు, గోల్డ్ మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని అది నెరవేరేందుకు సంకల్పం, పట్టుదల కలిగి ఉండాలన్నారు. ప్రపంచంలో అపరిమితమైన అవకాశాలు, అపరిమిత సామర్థ్యాలను సద్వినియోగం చేసుకునే దిశగా ప్రయాణం సాగించాలని సూచించారు. జీవితంలో మనం సాధించిన డిగ్రీలు వ్యక్తిగత యోగ్యతకు నిదర్శనమని తెలిపారు. గత పదిహేనేళ్లుగా సమాజానికి సేవ చేయడంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విశేషమైన పురోగతిని సాధించిందని వెల్లడించారు. ముఖ్యంగా సమాజంలోని అట్టడుగు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతిలో, విభిన్న రంగాలలో భాగస్వామ్యానికి అవకాశాలను అందించడం ద్వారా వారి ఆర్థికాభివృద్ధిని సులభతరం చేయడంలో విశ్వవిద్యాలయం సామాజిక పురోగతికి తన నిబద్ధతను ప్రదర్శించిందన్నారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ అత్యుత్తమ న్యాక్ ఎ గ్రేడును యూనివర్సిటీ పొందడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ విసి సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గవర్నర్‌ను సత్కరిస్తున్న యూనివర్సిటీ విసి సుందరవల్లి

పిన్నెల్లి వరుస దాడులు

- **టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరులు వరుసగా దాడులకు పాల్పడుతూనే ఉన్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలింగ్ రోజున ఇవిఎంను పిన్నెల్లి బద్దలుకొట్టినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. పోలింగ్ జరిగిన నాటి నుంచి పల్నాడు జిల్లాలో అల్లర్లు, అరాచకాలు పెద్దయెత్తున చోటుచేసుకున్నాయన్నారు. ఈ ఘటనలపై ఎన్నికల కమిషన్, పోలీస్ వ్యవస్థ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అమాయకులపై అక్రమ కేసులు

తాడిపత్రిలో జరిగిన అల్లర్లలో సంబంధం లేని వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని టిడిపి నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, దీపక్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. తాడిపత్రిలో టిడిపికి చెందిన వారినే ఎక్కువ మందిని కేసుల్లో ఇరికించారని అన్నారు. పెద్దారెడ్డి, ఆయన కుమారుడు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. 728 మంది నిందితుల్లో ఎక్కువ తమ పార్టీకి చెందిన వారినే చూపిస్తున్నారని పేర్కొన్నారు. కౌంటింగ్ రోజున మళ్లీ అరాచకాలు సృష్టించేందుకు పావులు కదుపుతున్నారన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించి అమాయకులను ఇరికించొద్దని కోరారు. ఇవిఎం ధ్వంసం ఘటనపై పిన్నెల్లిని తక్షణమే అరెస్టు చేయాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తాను టిడిపి నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమామహేశ్వరరావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎఎస్ రామకృష్ణ కలిసి వినతిపత్రం అందజేశారు. చంద్రగిరిలో పులివర్తి నానిని అరెస్టు చేయాలని పోలీసులపై ఒత్తిడి తెచ్చి కుట్ర చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆదేశాలతో జెసి దివాకర్ రెడ్డి నివాసంపై దాడి చేసిన డిఎస్‌పి చైతన్యను అరెస్టు చేయాలన్నారు.

ఫైళ్లపై ప్రతిపక్షం దృష్టి

- **తారుమారు కాకుండా జాగ్రత్తలు**

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రభుత్వ శాఖల్లో ఉన్న కీలక ఫైళ్లు తారుమారు కాకుండా ప్రతిపక్ష నేతలు దృష్టి సారిస్తున్నారు. ఇందుకోసం సచివాలయం, వివిధ శాఖాధిపతుల కార్యాలయాల్లో పని చేస్తూ తమకు అనుకూలంగా ఉండే వారిని వినియోగించుకుంటున్నారు. ఫైళ్లకు సంబంధించి ఏదైనా అనుమానం వస్తే తక్షణమే తమకు తెలియచేయాలని వారికి చెబుతున్నట్లు సమాచారం, అధికారులు అనుసరిస్తున్న కొన్ని చర్యలు అనుమానాలకు తావిస్తున్నట్లు ప్రతిపక్ష నేతలు ఇప్పటికే ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం పొందిన ఒక కేసుకు సంబంధించిన ఫైళ్లలోని కొన్ని పత్రాలను తగలబెట్టిన విషయాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. అలాగే కొద్ది రోజుల క్రితం పాలనకు కీలకమైన ఇ-ఆఫీస్‌ను తాత్కాలికంగా మూసివేయాలన్న నిర్ణయంపై నేరుగా గవర్నర్‌కే ఫిర్యాదు చేయడం తెలిసిందే. సచివాలయంలో, శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో కొంతమంది అధికార పార్టీకి, మరికొంతమంది తెలుగుదేశానికి చాలాకాలంగా అభిమానులుగా ఉన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొంతమంది ఉద్యోగులు వైకాపా నేతలకు కీలక సమాచారాన్ని ఇచ్చారని, ఇప్పుడు వైకాపా పాలనలో మరికొంతమంది తెలుగుదేశం నేతలకు, ఆ పార్టీ అనుకూల పత్రికలకు కీలక సమాచారాన్ని అందిస్తున్నారని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ తరహా కారణాలతో కొంతమంది ఉద్యోగులపై చర్యలు కూడా తీసుకున్నారు.

ప్రజల మనిషి సాంబశివరావు

- **ప్రథమ వర్ధంతి సభలో వక్తలు**

ప్రజాశక్తి - దుగ్గిరాల (గుంటూరు జిల్లా)

ప్రజల మనిషి నిష్కళంక కమ్యూనిస్టు వల్లభనేని సాంబశివరావు జీవితం అందరికీ ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సిపిఎం తెనాలి డివిజన్ దుగ్గిరాల మండల మాజీ కార్యదర్శి వల్లభనేని సాంబశివరావు ప్రథమ వర్ధంతి సభ బుధవారం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు అధ్యక్షతన తుమ్మపూడిలో జరిగింది. తొలుత సాంబశివరావు అమర స్థూపం ముందు పతాకాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి తులసీదాస్ ఆవిష్కరించారు. సాంబశివరావు చిత్రపటానికి సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పూలమాలవేసి నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న బి.తులసీదాస్, డి.సుబ్బారావు, పాశం రామారావు తదితరులు

ఈ సందర్భంగా జరిగిన సభలో తులసీదాస్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని సాంబశివరావు తూచా తప్పకుండా పాటించారని, ఆయన జీవితం ఆదర్శనీమని, కుటుంబాన్ని కూడా పార్టీ వైపు నడిపించారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి హెచ్.బాబూరావు మాట్లాడుతూ.. నేటి తరానికి, విలువలకు నిలువుటద్దంగా సాంబశివరావు నిలిచారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక ఉద్యమంలో ఆయన క్షేత్రస్థాయిలో పూర్తిగా అధ్యయనం చేసేవారని, అనంతరమే దానిపై ఆందోళన నిర్వహించేవారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల తన అనుబంధంలో మచ్చలేని నాయకుడు సాంబశివరావు అని పేర్కొన్నారు. సిపిఎం మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి, రైతు సంఘం నాయకులు జొన్న శివశంకర్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ధనలక్ష్మి, బాపట్ల జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అగస్టిన్, తెనాలి డివిజన్ కార్యదర్శి మలకా శివ సాంబి రెడ్డి, అమరావతి డివిజన్ కార్యదర్శి ఎం రవి, జిల్లా నాయకులు ఈమని అప్పారావు, చెంగయ్య, డి వెంకటరెడ్డి, సిపిఎం గ్రామ కార్యదర్శి ఎం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పరారీలో ఎమ్మెల్యే పిన్నెల్లి

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

కాల్‌డేటా సిగ్నల్స్‌తో గుర్తింపు

ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మంగళవారం రాత్రి నుండే పిన్నెల్లి కోసం గాలింపు చర్యలను పోలీసు అధికారులు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా కాల్‌డేటా సిగ్నల్స్ సహాయంలో ఆయన తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్ర పోలసులు తెలంగాణ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఛేజింగ్ జరిగిందని, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పారిపోయేందుకు శక్త మేర ప్రయత్నించారని వార్తలు వచ్చాయి, ఈ క్రమంలో పోలీసులు పిన్నెల్లికి చెందిన వాహనాలను, పలువురు అనుచరులను, డ్రైవర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పిన్నెల్లి వదిలి వెళ్లిన వాహనాలు

పిన్నెల్లి స్వయంగా ధ్వంసం చేశారు : టిడిపిఏజెంటు నంబూరు

పోలింగ్ రోజున ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్వాయ్ గేటు వద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలోకి దూసుకువచ్చారని టిడిపి ఏజెంటు నంబూరు శేషగిరిరావు తెలిపారు.బుధవారం ఆయన మాచర్లలో మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన వెంటనే నేరుగా ఈవిఎం మిషన్ వద్దకు వెళ్లి మిషన్‌ను నేలకేసి కొట్టారని తెలిపారు. అడ్డుకున్న తనపై వైసిపి కార్యకర్తలు దాడి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే పిన్నెల్లి తనకు వేలు చూపిస్తూ బెదిరించారని తెలిపారు. పిన్నెల్లి నుంచి తనకు ప్రాణహాని ఉందన్నారు.

ఏడేళ్లు శిక్ష - సిఇఓ ముఖేష్‌కుమార్ మీనా

ఇవిఎం ధ్వంసం ఘటనలో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కనీసం ఏడేళ్లు జైలు శిక్ష పడుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. మీడియా ప్రతినిధులతో బుధవారం ఉదయం మాట్లాడిన ఆయన ఈ సంఘటనపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర అగ్రహంతో ఉందని, భవిష్యత్తుల్లో ఇటువంటి సంఘటనలు చేయడానికి ఇతరులు సాహించకుండా కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించిందని చెప్పారు. ఈ సంఘటనలో ఐపిసి కింద 143,147,448,427,353,452,120 బిసెక్షన్లతో పాటు పిడి పిపి చట్టం కింద మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇవిఎమ్‌ల ధ్వంసం చేసిన డేటా భద్రంగా ఉందని, డేటా భద్రంగా ఉండటం వల్ల కొత్త ఇవిఎమ్‌లతో పోలింగ్ కొనసాగించామన్నారు. ఘటన జరిగినమరుసటి రోజు ఆధారాలను పోలీసులకు అప్పజెప్పామన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు చేసిన దాడిగా కేసు నమోదుకావడంతో వెబ్‌క్యాస్ట్‌ను పరిశీలించి ఈనెల 20న పిన్నెల్లిపై పోలీసులు కేసు నమోదు చేశారని సిఇఓ తెలిపారు. అదే రోజు రెంటచింతల కోర్టులో ఎస్‌ఐ మెమో దాఖలు చేశారన్నారు. సిట్‌కు పోలీసులు అన్ని వివరాలు అందించారన్నారు. నిందితుల కోసం గాలింపు జరుగుతోందని త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తారని భావిస్తున్నామన్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

- **ముగ్గురు భారత సంతతి విద్యార్థులు మృతి**

అమెరికాలో జార్జియా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారత సంతతి విద్యార్థులు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 14న ఈ ఘటన చోటు చేసుకోగా..అల్ఫారెట్టా పోలీసులు తాజాగా వివరాలు వెల్లడించారు. జార్జియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఆర్యన్ జోషి, శ్రీయా, అన్వీ శర్మ, రిత్వక్ సోమేపల్లి, మహ్మద్ లియాకత్ అనే ఐదుగురు భారత సంతతి విద్యార్థులు కారులో ఓ కార్యక్రమానికి వెళ్తున్నారు. ఈ క్రమంలోనే జార్జియాలోని అల్ఫారెట్టా సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ఆర్యన్ జోషి, శ్రియలు అక్కడికక్కడే మరణించగా..అన్వీ శర్మ పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందారు. మిగతా ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత విద్యార్థులంతా 18ఏళ్ల వయసు వారే కావడం గమనార్హం. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతి వేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

వేతన సమస్య పరిష్కారానికి ఐక్య ఉద్యమం

- **ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు**

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించేంత వరకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంపై ఒత్తిడి చేసేందుకు అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1196వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ టిపిపి విభాగం కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఎన్.రామారావు మాట్లాడుతూ.. కార్మికులు కష్టించి పనిచేస్తున్నా యాజమాన్యం వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి డిసిహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఏదో ఒక సమస్యను సృష్టించి స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల వైపు నెట్టాలని చూస్తున్న తీరును ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి నరేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి చిన్నారి

- **రూ.4.5 లక్షలకు విక్రయించే యత్నం**
- **ముఠాను పట్టుకున్న మేడిపల్లి పోలీసులు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏ తల్లి కన్న బిడ్డో.. ఎవరికి బరువైందో.. అమ్మకానికి పెట్టారు. మూడు నెలల పసికందును విక్రయించే యత్నం చేయగా.. పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. ముగ్గురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పిఎస్ పరిధిలో బుధవారం జరిగింది. మేడిపల్లి సిఐ ఆర్.గోవింద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ రామకృష్ణనగర్ రిలయన్స్ మార్ట్ సమీపంలో ఒక మహిళ మూడు నెలల వయస్సున్న ఆడపిల్లను రూ.4.5 లక్షలకు విక్రయించేందుకు సిద్ధమయ్యారన్న విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దాంతో వారు అక్కడకు చేరుకున్నారు. పీర్జాదిగూడలో నివాసం ఉంటున్న ఐత శోభారాణి ఒక ప్రయివేటు ప్రథమ చికిత్సా కేంద్రంలో పసికందును పట్టుకుని ఉండగా.. అదుపులోకి తీసుకున్నారు. ఆమెకు సహకరించిన చింత స్వప్న, షేక్ సలీం పాషాను అరెస్టు చేశారు. పసికందును హైదరాబాద్‌లోని శిశు సంరక్షణా కేంద్రానికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పాప ఎక్కడి నుంచి వచ్చింది?

నిందుతులను విచారించగా.. విజయవాడకు చెందిన వారి నుంచి పాపను అన్నోజిగూడకు చెందిన పద్మ, హరి తీసుకొచ్చినట్టు తెలిపారు. దాంతో అసలు నిందితుల కోసం వారు చెప్పిన అడ్రసుకు పోలీసులు వెళ్లేసరికే ఇంటికి తాళాలు వేసి పరారయ్యారు. అయితే చిన్న పిల్లలను విక్రయించే ఈ ముఠా కార్యకలాపాలు ఇంకా ఎక్కడెక్కడ ఉన్నాయో అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.



నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

'పర్సా'కు సిఐటియు నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు పర్సా సత్యనారాయణ వర్ధంతి కార్యక్రమం సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగింది. సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు కలిసి పర్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వి ఉమామహేశ్వరరావు, కె ఉమామహేశ్వరరావు, కె ధనలక్ష్మి, కెఆర్‌కె మూర్తి, వివిఎల్ నర్సింహులు, కెఎస్ కోటేశ్వరరావు, ఎం సత్యప్రసాద్, ఎం శివ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు ముందే మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు

- **కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద జియో ట్యూబ్ వాల్**
- **బ్యారేజీలను పరిశీలించిన సాంకేతిక నిపుణులు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే వర్షాకాలానికి ముందే ప్రాణహిత నీటిని వృథాగా పోనీయకుండా ఎత్తిపోయడానికి వీలుగా బ్యారేజీల రక్షణా చర్యలను చేపట్టి 15 రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించారు. పూణే నుంచి సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంట్రల్ సిడబ్ల్యుసిఆర్ఎస్‌కు చెందిన నిపుణులు బుధవారం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ విభాగానికి చెందిన శాస్త్రవేత్త జెఎస్ ఎడ్లబడ్కర్, జియోఫిజికల్ ఇన్వెస్టిగేషన్ శాస్త్రవేత్త డాక్టర్ సి ధనుంజయ నాయుడు, నాన్ డిస్ట్రక్టివ్ టెస్ట్స్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రకాశ్ పాలే.. ఏడవ బ్లాక్‌లో కుంగిన పిల్లర్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలంలో వరద తాకిడికి బ్యారేజీ తట్టుకునే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఇరిగేషన్ అధికారులకు సూచించారు. బ్యారేజీ పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ గేట్ల కింది భాగంలో పేరుకుపోయిన ఇసుకను వెంటనే తీసేయాలని ఆదేశించారు. ముఖ్యంగా భారీ వర్షాల కారణంగా వరద తాకిడికి తట్టుకునే విధంగా బ్యారేజీ పూర్తి గేట్లను ఎత్తివేయాలని ఆదేశాలు జారీ చేశారు. గోదావరి ప్రాణహిత జలాలు వృథాగా పోకుండా మేడిగడ్డకు 17 కిలోమీటర్ల దూరంలో తండేపల్లి పంప్ హౌస్ వద్ద జియో ట్యూబ్ గోడలు నిర్మించాలని సూచించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో జియో ఫిజికల్, జియో టెక్నికల్, జియో డిస్ట్రక్టివ్ పరీక్షలను నిపుణులు నిర్వహించారు. రాబోయే వరదలకు కుంగిన ఏడవ బ్లాక్ లోని 19, 20, 21 పిల్లర్లు తట్టుకుంటాయా లేదా అనే విషయాన్నీ పరీక్షించారు. నిపుణుల బృందం పరీక్షలు, పరిశీలన ద్వారా కనుగొన్న వివరాలను రాష్ట్రంలో ప్రభుత్వానికి సంబంధిత శాఖల వారికి పూర్తిగా నివేదించి తదుపరి చర్యలను సూచించేందుకు జలసౌధలో ఇరిగేషన్ సెక్రటరీ, ఇఎన్‌సి అధికారులతో సమావేశం కానున్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ నాగరాజు, డిఇ సురేష్, అధికారులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన బొలేరో

- **ఎనిమిది మందికి స్వల్ప గాయాలు**
- **తప్పిన పెను ప్రమాదం**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాలిపేరు కాలువలోకి బొలేరో వాహనం దూసుకెళ్లిన ఘటనలో ఎనిమిది మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ధనవాయిపేట సమీపాన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ సరిహద్దు బూరుగుపాడు ఆదివాసీ గ్రామం, చత్తీస్‌గఢ్ సరిహద్దులోని సుకుమా జిల్లా దొర్నపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దెబ్బతోట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతదేహాన్ని తీసుకొని వెళ్లడానికి అక్కడి నుండి వచ్చిన పదిమందితో పాటు మృతదేహంతో ప్రయాణిస్తున్న బొలేరో వాహనం మూల మలుపు వద్ద అదుపుతప్పి కాలువలోకి జారి పడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న వారిలో ఎనిమిది మందికి స్వల్ప గాయాలైనట్టు స్థానికులు తెలిపారు. అతి వేగంగా వాహనం నడిపినట్లయితే పెను ప్రమాదం జరిగి ఉండేదని క్షతగాత్రులు అంటున్నారు. కాగా, క్షతగాత్రులందరినీ స్థానిక సత్యనారాయణపురం వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

కాలువలోకి దూసుకెళ్లిన వాహనం

కంటైనర్‌ను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్

- డ్రైవర్ సజీవ దహనం

ప్రజాశక్తి-మేదరమెట్ల (బాపట్ల జిల్లా)

శ్రీధర్

కంటైనర్‌ను ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో మంటలు వ్యాపించి.. డ్రైవర్ సజీవ దహనమయ్యారు. ఈ ఘటన బాపట్ల జిల్లా మేదరమెట్ల మండలంలోని బొడ్డువానిపాలెం పైలాన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. కృష్ణపట్నం పోర్టు నుంచి పేరిచెర్లలో ఉన్న జోసిల్ సోప్స్ కంపెనీకి ఆయిల్‌తో వెళుతున్న ట్యాంకర్ బొడ్డువానిపాలెం పైలాన్ వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్ క్యాబిన్‌లో మంటలు వ్యాపించాయి. క్షణాల్లో మంటలు లారీ మొత్తం వ్యాపించడంతో డ్రైవర్, ఓనర్ పొట్లూరి శ్రీధర్(40) బయటకు రాలేక అందులో చిక్కుకుపోయారు. అగ్నికీలలకు సజీవ దహనమయ్యారు. మృతుడు నెల్లూరు జిల్లా, కొవ్వూరు మండలం, ఈడుమడుగు గ్రామవాసిగా పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులతో చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్ (శ్రీసత్యసాయి జిల్లా)

బాలచౌడయ్య (ఫైల్)

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం పట్టణంలోని శివానగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ, మహాలక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మీనారాయణ కొంతకాలం క్రితం మరణించారు. పెద్ద కుమారుడు శీలా బాలచౌడయ్య (29)కు రెండేళ్ల క్రితం పద్మావతితో వివాహమైంది. భార్యాభర్తలు ఇద్దరూ కేశవనగర్‌లోని ఓ మగ్గాల బిల్డింగ్‌లో కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. చౌడయ్య తల్లి మహాలక్ష్మీ ఇంట్లో సొంతమగ్గం ద్వారా చీరలను నేసేవారు. చౌడయ్య పెళ్లి, కుటుంబ పోషణ, ఇంట్లో మగ్గం నిర్వహణ కోసం దాదాపు రూ. నాలుగు లక్షల వరకు అప్పులు చేశారు. అటు కూలి మగ్గం ద్వారా, ఇటు సొంత మగ్గం ద్వారా ఆదాయం రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చడం కష్టమయ్యింది. దీంతో చౌడయ్య తీవ్ర మానసిక ఆవేదనకు లోనయ్యేవారు. మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు చూసి కన్నీటి పర్యవంతమయ్యారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని తల్లి, సోదరుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత విద్వేషాగ్నికి 'మెటా' ఆజ్యం

- ముస్లింలపై విద్వేష ప్రసంగాలకు ఆమోదం
- మోడీపై విమర్శనాత్మక ప్రకటనలకు నిరాకరణ

న్యూఢిల్లీ : ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపు సంస్థ అయిన మెటా ప్రకటనల ఎంపికలో చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్న తీరు వెలుగులోకి వచ్చింది. మెటా అధినేత జుకెర్‌బర్గ్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మధ్యన అత్యంత సన్నిహిత సంబంధాలున్న సంగతి విదితమే. ఆ బంధంతోనే దేశంలో ప్రస్తుత సార్వత్రిక సమరంలో అత్యంత కీలకమైన సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఏకపక్షంగా బిజెపికి అనుకూలంగా నడిపేందుకు మెటా ప్రయత్నిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల సమయంలో మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు మెటా పూర్తి స్థాయిలో సహకరిస్తోంది. తద్వారా అగ్నికి ఆజ్యం పోస్తోంది. ముస్లిం మైనారిటీలు, ప్రతిపక్షాలపై దుష్ప్రచారాన్ని సాగించేందుకు కృత్రిమ మేథ (ఏఐ) సాయంతో రూపొందించిన రాజకీయ ప్రకటనలకు మెటా గ్రీన్‌సిగ్నల్ ఇస్తోంది. దేశంలో నివసిస్తున్న ముస్లింలను దూషిస్తూ తయారు చేసిన పలు ప్రకటనలు ఫేస్‌బుక్‌లో దర్శనమిచ్చాయి. 'ఈ చీడపురుగులను తగలబెట్టండి', 'హిందువుల రక్తం చిందుతోంది. ఈ చొరబాటుదారులను తగలబెట్టాలి' వంటి రెచ్చగొట్టే ప్రకటనలను సైతం ఫేస్‌బుక్ ఆమోదించడం గమనార్హం.

హిందూ మతోన్మాద భావజాలంతో ప్రతిపక్ష నేతలపై దుష్ప్రచారం చేయడం, ఇతర సందేశాలు పంపడం వంటివి కూడా ఫేస్‌బుక్‌లో కన్పించాయి. దేశంలో హిందువులు అనే వారు లేకుండా చేయాలని ప్రతిపక్ష నేత ఒకరు చెప్పినట్లు తప్పుడు వార్త ప్రచారంలోకి వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఓ ప్రకటన వచ్చింది. ఆ నేతను ఉరితీయాలంటూ అందులో డిమాండ్ చేశారు. ఈ ప్రకటనలో సందేశం పక్కనే పాకిస్తాన్ జాతీయ పతాకాన్ని చూపించారు.

ఆ విధానాలు వారికి వర్తించవా?

మోడీకి వ్యతిరేకంగా వచ్చిన ప్రకటన సహా మొత్తం ఐదు రాజకీయ ప్రకటనలను మెటా తిరస్కరించింది. విద్వేష ప్రసంగాలకు సంబంధించి మెటా విధానాలను ఈ ప్రకటనలు ఉల్లంఘించాయని తెలిపింది. అయితే అదే సమయంలో మెటా విధానాలను బాహాటంగా ఉల్లంఘిస్తూ, ముస్లింలను లక్ష్యంగా చేసుకొని రూపొందించిన 14 ప్రకటనలకు ఆమోదం లభించడం గమనార్హం. బిజెపి కర్నాటక రాష్ట్ర శాఖ షేర్ చేసిన యానిమేటెడ్ వీడియోను ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిన తర్వాతే సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' తొలగించిన సంగతి తెలిసిందే.

నివేదిక ఏం చెప్పింది?

ఇండియా సివిల్ వాచ్ ఇంటర్నేషనల్ (ఐసిడబ్ల్యుఐ), కార్పొరేట్ జవాబుదారీ సంస్థ ఎకో సంయుక్తంగా ఓ నివేదికను రూపొందించి మెటా యాడ్ లైబ్రరీకి అందజేశాయి. ఈ నెల 8-13 తేదీల మధ్య...అంటే లోక్‌సభ ఎన్నికల మూడవ, నాలుగవ దశల పోలింగ్ మధ్య వచ్చిన ప్రకటనలను ఈ సంస్థలు పరిశీలించాయి. ఈ ప్రకటనల్లో ఉన్న ప్రమాదకరమైన రాజకీయ అంశాలను గుర్తించి తొలగించాల్సిందిగా ఆ సంస్థలు కంపెనీ యంత్రాంగాన్ని కోరాయి. దేశంలో జరుగుతున్న విద్వేష ప్రసంగాలు, దుష్ప్రచారాలను ఆధారంగా చేసుకొని ఈ ప్రకటనలను రూపొందించారని నివేదిక ఎత్తిచూపింది. ఆంగ్లం, హిందీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ భాషల్లో ఉన్న 22 ప్రకటనలను పరిశోధకులు మెటాకు అందజేశారు. అయితే ఆశ్చర్యకరంగా వాటిలో 14 ప్రకటనలకు 24 గంటల వ్యవధిలోనే మెటా ఆమోదం తెలిపింది. మరో మూడింటిని చిన్న చిన్న ట్వీక్స్ ఆమోదించాయి. కాగా ఆ ప్రకటనలు ప్రచురితం కాకుండా పరిశోధకులు వెంటనే వాటిని తొలగించారు. ఆమోదించిన ప్రకటనల్లో ఏఐ సాయంతో వక్రీకరించిన చిత్రాలే ఉన్నాయన్న విషయాన్ని గుర్తించడంలో మెటా విఫలమైందని వారు తేల్చారు.

దర్శనం అనంతరం ఆలయం ఎదుట తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

ఎపి ప్రభుత్వంతో సత్సంబంధాలు

- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుమల

ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడే ప్రభుత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శ్రీవారికి తన మనువడి పుట్టువెంట్రుకల మొక్కు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎపిలో ఏర్పడే ప్రభుత్వంతో కలిసి సమస్యలు పరిష్కరించుకుని కలసికట్టుగా నడుస్తామన్నారు. రెండు రాష్ట్రాల అభివద్ధికి ఒకరికి ఒకరు సహకరించుకోవాలని ఆకాంక్షించారు. తిరుమలలో తెలంగాణ ప్రభుత్వం తరపున సత్రం, కళ్యాణ మండపం నిర్మిస్తామని ప్రకటించారు. శ్రీవారి సేవలో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యం కూడా తీసుకోవాలని ఎపి సిఎంకు విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. స్వామి వారి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ లాభాల్లో 60% వృద్ధి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం2023-24లో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ 60 శాతం వృద్ధితో రూ.35 కోట్ల నికర లాభాలు సాధించింది. బ్యాంక్ నెలసరి సగటు లావాదేవీలు 8.04 కోట్లుగా నమోదయ్యాయి. ఖాతాదారుల డిపాజిట్లు 50 శాతం పెరిగి రూ.2,801 కోట్లకు చేరాయి. స్థూల వ్యాపార విలువ రూ.2.5 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. అయితే పేమెంట్ బ్యాంక్‌లు రుణాలు జారీ చేయడానికి ఆర్‌బిఐ అనుమతి లేదు. తమ బ్యాంక్ 5 లక్షల టచ్ పాయింట్లకు చేరాయని ఆ సంస్థ తెలిపింది.

ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.203 కోట్లు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు విడుదల చేసింది. గడిచిన కొన్ని నెలల నుంచి పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవటంతో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపేస్తామని నెట్‌వర్క్ హాస్పిటల్స్ సంఘం అల్టిమేటం జారీ చేయటంతో అలెర్టయిన ప్రభుత్వం రూ.203 కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. దాదాపు రూ.1500 కోట్లు పైబడి బకాయిలున్నట్లు నెట్‌వర్క్ ఆస్పత్రులు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే పెండింగ్ బకాయిల్లో కొంత శాతాన్ని ఆస్పత్రుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒ లక్ష్మీశా బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా లక్ష్మీశా మాట్లాడుతూ.. నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్, ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఆరోగ్యశ్రీ సేవలకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా 3,257 చికిత్సలకు అర్హులైన లబ్ధిదారులకు నగదు రహిత చికిత్సను ప్రభుత్వం అందిస్తోందని, ప్రతి కుటుంబానికీ వార్షిక చికిత్స పరిమితిని రూ.25 లక్షల వరకు అందిస్తున్నామని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ కింద 42,91,254 మంది లబ్ధిదారులకు రూ.13,470.89 కోట్ల నగదు రహిత చికిత్సను అందించామని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.356 కోట్లను నెట్వర్క్ ఆస్పత్రులకు జమచేశామని, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లో ఇప్పటి వరకు రూ.366 కోట్లు జమ చేశామని అన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు, సేవలకు అంతరాయం కలిగించే ఆస్పత్రులపై తగిన చర్యలు తీసుకుంటామని, పేద ప్రజలకు అత్యవసర సేవలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలిచ్చిందని ఆయన వివరించారు.

పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పాఠశాలలు పున:ప్రారంభమయ్యేనాటికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్‌తోపాటు బ్యాగులు వంటివన్నీ విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. 2024-25 విద్యా సంవత్సర సన్నాహక ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఇప్పటి వరకు ఎన్ని పుస్తకాలు, ఎన్ని బ్యాగులు సమకూర్చారు? ఇంకా ఎన్ని సమకూర్చాలి? తదితరవాటిపై ఆయన సమీక్షించారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ.. జూన్ 12న పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని, జూన్ 10లోగా విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు యూనిఫామ్ పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే 82 శాతం పుస్తకాల ప్రచురణ పూర్తై, మండల స్టాక్ పాయింట్లకు చేరాయని అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో 1 నుంచి 10 వరకూ బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 1 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 70 లక్షల 42 వేల 12 మంది విద్యార్థులను ఎన్రోల్ చేయగా.. వారిలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 36.54 లక్షల మంది ఎన్రోల్ అయ్యారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కమిషనరు కె భాస్కర్, బిఆర్ అంబేద్కర్, ఎపిఎస్‌డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి పేరంటాళ్లమ్మ తిరునాళ్లు

ప్రజాశక్తి - నందిగామ (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో గురువారం నుంచి లక్ష్మీ పేరంటాళ్లమ్మవారి తిరునాళ ప్రారంభమవుతాయని ఆలయ ఇన్‌ఛార్జ్ ఇఒ ఫణికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 24న ఊయల సేవ, 25న గ్రామ శిల, బోనాలు, 26న గ్రామ బోనాలు, 27వ తేదీ దీవెన భండారు నిర్వహిస్తారు.

కేంద్రానికి ఆర్‌బిఐ బంపర్ డివిడెండ్

- 2023-24కుగాను రూ.2.1 లక్షల కోట్లు
- ఇంతక్రితం కంటే 140 శాతం అదనం

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కేంద్ర భక్తిని చాటుకుంది. ఆర్థిక సంవత్సరం 2022-23కు గాను ఏకంగా రూ.2.1 లక్షల కోట్ల రికార్డ్ డివిడెండ్‌ను ప్రకటించింది. ఈ మేరకు గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆర్‌బిఐ కేంద్ర బోర్డు డైరెక్టర్ల సమావేశమై డివిడెండ్ నిధులను ప్రభుత్వానికి బదిలీ చేసే విషయమై ఆమోదం తెలిపారు. ఇంతక్రితం 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.87,420 కోట్ల డివిడెండ్‌ను అందించింది. దీంతో పోల్చితే రెండు రెట్ల (140 శాతం) పైగా పెంచడం విశేషం.

ఆర్థిక సంవత్సరం 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో ఆర్‌బిఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో రూ.1.02 లక్షల కోట్లు సమకూరుతాయని కేంద్రం అంచనా వేసింది. మరోవైపు ఈ ఏడాది రూ.75,000-1,20,000 కోట్ల మేర ఆర్‌బిఐ డివిడెండ్ ప్రకటించవచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. ప్రభుత్వం సహా ఆర్థిక నిపుణుల అంచనాలు మించి ఆర్‌బిఐ రికార్డ్ స్థాయిలో డివిడెండ్ ప్రకటన ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆర్‌బిఐ చెల్లించనున్న డివిడెంట్‌తో కొత్తగా అధికారం చేపట్టే ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరనుంది. పెట్టుబడులపై వచ్చే మిగులు ఆదాయం, కరెన్సీ ముద్రణ కోసం తీసుకునే ఛార్జ్, తమ వద్ద డాలర్ల విలువలో హెచ్చుతగ్గులపై వచ్చే ఆదాయం, బ్యాంక్‌లకు ఇచ్చే రుణాలపై వచ్చే వడ్డీ తదితర ఆదాయాల నుంచి ఆర్‌బిఐ ప్రతీ ఏడాది డివిడెండ్ రూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తుంది. ఆర్‌బిఐ ఇచ్చిన డివిడెండ్ వల్ల కేంద్రం తన ద్రవ్య లోటును పూడ్చుకోవడానికి ఉపయోగపడనుంది.

సమిష్టి కృషితోనే జీవ వైవిధ్య పరిరక్షణ

రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

అన్ని వర్గాల ప్రజల సమిష్టి కృషి, భాగస్వామ్యంతోనే జీవ వైవిధ్య పరిరక్షణ సాధ్యమవుతుందని, తద్వారా 2030 నాటికి అన్ని రంగాలకు సుస్థిరమైన పర్యావరణాభివృద్ధి ఫలాలు అందుతాయని, ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ బయో డైవర్సిటీ బోర్డు తీవ్ర కృషి చేస్తోందని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు చిరంజీవి చౌదరి (ఐఎఫ్‌ఎస్) తెలిపారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎయు కన్వెన్షన్ హాలులో బుధవారం నిర్వహించిన జాతీయ స్థాయి జీవ వైవిధ్య దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సుస్థిర పద్ధతిలో ప్రయోజనాలు అందించేందుకు, జీవ వైవిధ్య పరిరక్షణ లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాయుత చర్యలతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. జీవ వైవిధ్య పరిరక్షణ, జీవ వనరుల స్థిరమైన వినియోగం, అన్ని వాటాదారుల మధ్య జీవ వనరుల న్యాయమైన, సమానమైన భాగస్వామ్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలను రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు నిర్దేశించుకుందని వెల్లడించారు.

'రియల్' దారెటు?

- విశాఖవైపా... అమరావతిలోనా
- రెండుచోట్లా భూ లావాదేవీలపై ఆరా
- నాలుగో తేదీ కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో నిర్లిప్తంగా సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం భవిష్యత్ దారెటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. గత ఏడాది కాలంలో రాష్ట్రంలో రియల్ బూమ్ మందగించింది. అమరావతి, విశాఖపట్నం మధ్య రాజధాని అంశం తిరుగుతుండడంతో రియల్టర్లు కూడా పెద్దగా ఆసక్తి చూపించకపోవడంతో రియల్ వ్యాపారం పడకేసింది. 2019 వరకు అమరావతి ప్రాంతంలో నిర్మాణ రంగం పెద్ద ఎత్తునే సాగింది. ఇంకో ఏడాది గడిస్తే మరింతగా అభివృద్ధి సాధిస్తుందన్న భావన వ్యక్తమవుతున్న తరుణంలోనే పాత ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం, అమరావతి స్థానంలో మూడు రాజధానుల ప్రకటన రావడంతో అమరావతి ప్రాంతంలో నిర్మాణాలు ఎక్కడివక్కడే నిలిచి పోయాయి. అయితే విశాఖలో కూడా నిర్మాణ రంగం పెద్దగా పుంజుకోలేదు. కొంతమంది బడా వ్యక్తులు, రాజకీయ ప్రాబల్యం ఉన్న వారు విశాఖ చుట్టుపక్కల పెద్ద మొత్తంలోనే భూములు కొనుగోలు చేశారు. కబ్జాలూ ఎక్కువగానే జరిగాయి. అయితే ఈ భూముల్లో కూడా నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆ భూములు ఖాళీగానే ఉండిపోయాయి. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో అధికార పార్టీయే మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ చుట్టుపక్కల రియల్ రంగం ఊపందుకుంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వం మారి మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి వస్తే అమరావతి ప్రాంతంలో పెట్టుబడులు పెరిగి నిర్మాణ రంగం పుంజుకుంటుందని రియల్టర్లు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. అందుకే జూన్ నాలుగో తేదీన వచ్చే ఫలితాల కోసం రియల్టర్లు ఎదురుచూస్తున్నారు. అయితే ముందుగానే ఇరు ప్రాంతాల్లో భూముల పరిస్థితి, పెరిగే భూముల విలువ, అక్కడ అభివృద్ధి ఉన్న అవకాశాలు వంటివాటిపై రియల్ వ్యాపారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఇవే అంశాలపై పక్క రాష్ట్రాల్లో ఉన్న వారు కూడా దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుందని, కూటమి నేతృత్వంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా వస్తే అమరావతిలో రియల్ రంగం బాగుంటుందన్న భావాన్ని నిర్మాణ రంగ ప్రముఖులు వ్యక్తం చేస్తున్నారు.

KARVY FINANCE

SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన ప్రచురణ

కార్పొరేట్ ఆఫీసు: మెసర్స్ కార్వి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, 301, 3వ అంతస్తు, గుజ్రాల్స్ హౌస్, 167 సిఎస్‌టి రోడ్, కొలివెరీ ఏరియా విలేజ్, కలీనా, శాంతాక్రుజ్ (ఇ), ముంబయి-400098.

ఇందుమూలంగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారులు/ తాకట్టుదారులకు, ఎవరైతే కార్వి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ నుండి, వారిచే పొందియున్న రుణ సదుపాయాలకు సంబంధించి అసలు& వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్టిగావింపబడిన వారికి ప్రకటన ఇవ్వడమేమనగా, వారి రుణ ఖాతాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. వారికి ది సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (SARFAESI చట్టం) యొక్క సెక్షన్ 13(2) క్రింద వారికి, వారి గతంలో తెలిసిన చిరునామాలకు నోటీసులు జారీచేయబడినవి, కాని అవి బట్వాడా కాకుండానే వెనుదిరిగినవి మరియు అట్టి పరిస్థిల్లో మేము ఈ బహిరంగ ప్రకటన ద్వారా వారికి తెలియజేస్తున్నాము.

లోన్ అగ్రిమెంట్ నెం./ రుణగ్రహీతల/ హామీదారుల పేరు	డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసులో మొత్తాలు
లోన్ అగ్రిమెంట్ నెం.412572 **1) మేడిది వెంకటేశ్వర్ రావు, 2) మేడిది నాగమణి, 3) మేడిది రామ్ సురేష్,** డోర్ నెం.59ఏ-21/4-1, దాసరి నారీ వీధి, ఆర్‌ఆర్ గార్డెన్స్, పటమట హైస్కూల్ రోడ్, విజయవాడ- 520010	**17 మే, 2024**	**రూ. 20,29,583/-** (రూపాయలు ఇరవై లక్షల ఇరవై తొమ్మిది వేల ఐదు వందల ఎనభై మూడు మాత్రమే

సెక్యూర్డ్ అసెట్స్ (స్థిరాస్తుల) వివరణ	ఎన్‌పిఏ తేది
కృష్ణ జిల్లా, పటమట సబ్-రిజిస్ట్రార్ అధికార పరిధి, పెనమలూరు మండలం, కానూరు గ్రామపంచాయితీ ఏరియా, కానూరు గ్రామంలోని 444చ.గ.ల విస్తీర్ణపు ఆర్‌ఎస్ నెం.184/1, ప్లాట్ నెం.68& 69, అసెస్‌మెంట్ నెం.5945, పాత డోర్ నెం.16-137/3ఏ, న్యూ డోర్ నెం.18-361 కలిగిన ఆస్తి మొత్తం భాగం మరియు **సరిహద్దులు: తూర్పు:** ఇతరుల ఆస్తి, **పడమర:** అడుగుల 20.0 వెడల్పు రోడ్, **ఉత్తరం:** బన్నరావూరి ఏడుకొండలు మరియు ఇతరుల ఆస్తి, **దక్షిణం** : ఎస్‌కె. మహమూదా బేగం ఆస్తి.	1 సెప్టెంబర్, 2018.

పై రుణగ్రహీతలు/ లేదా వారి హామీదారులు/ తాకట్టుదారులు (ఎక్కడైతే వర్తించునో) అను వారికి ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజుల్లోగా బకాయి మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా ఆహ్వానిస్తున్నాము, విఫలం చెందిన ఏదైతే, SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద, సదరు 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు తీసుకోబడుతాయి. తదుపరి మరింత సమాచారం ఇవ్వడమేమనగా, SARFAESI చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద ఇది మీరు శ్రద్ధవహించుటకు మీ దృష్టికి తేవడమైనది. అమ్మకం లేదా ట్రాన్స్‌ఫర్ కొరకు నిర్ణయించిన తేదీకి ముందు ఏ సమయమునైనా అన్ని ఖర్చులు, చార్జీలు మరియు మాచే వెచ్చించిన వ్యయాలతోసహా బకాయిలను చెల్లించినట్లైతే, సెక్యూర్డ్ అసెట్ విక్రయించబడదు లేదా మాచేత ట్రాన్స్‌ఫర్ చేయబడదు, మరియు సెక్యూర్డ్ అసెట్ ట్రాన్స్‌ఫర్ లేదా అమ్మకం కొరకు మాచేత ఏదేని తదుపరి చర్యలు తీసుకోబడవు.

సం/-

తేది: 23-05-2024, ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి, కార్వీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ తరపున.

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన

ICICI Home Finance

రిజిష్టర్డు ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బంద్ర-కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051.
కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరీ కుర్ల రోడ్డు, అంధేరీ ఈస్ట్, ముంబయి-400059.
బ్రాంచి ఆఫీసు: 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి బిల్డింగ్, మహాత్మా గాంధీ రోడ్డు, చంద్రమౌళిపురం, విజయవాడ-520010.

ఏదైతే,
క్రింది సంతకందారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసులు జారీచేసి, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
ఆ విధంగా మొత్తాలను తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలం చెందినందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని, దిగువ పేర్కొన్న తేదీలలో స్వాధీనంచేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌కు చెల్లింపులుచేయుటకు లోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరణ/ స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తాలు (రూ)	బ్రాంచి పేరు
1.	అప్పల ఆనంద్ కుమార్ (రుణగ్రహీత), ఎ. వేంకటేశ్వర రావు (సహ-రుణగ్రహీత), LHVJW00001324972.	ఇ.నం. 2-239, బుద్ధవరం రోడ్, గన్నవరం గ్రామపంచాయతి, గన్నవరం మండలం, 477-2, విజయవాడ-520010 (రెఫరెన్స్ నం. LHVJW00001324972). సరిహద్దులు: ఉత్తరం: డా॥ ఏకాంభరేశ్వర రావు, దక్షిణం: భద్దవరం రోడ్, తూర్పు: మహ్మద్ గాలిబీ ల్యాండ్, పడమర: ఎవి సుబ్బయ్య ల్యాండ్/ స్వాధీనతా తేది: 18-మే-24.	13-04-2023 Rs. 45,77,202/-	విజయవాడ-బి
2.	అప్పల ఆనంద్ కుమార్ (రుణగ్రహీత), ఎ. వేంకటేశ్వర రావు (సహ-రుణగ్రహీత), LHVJW00001358370.	ఇ.నం. 2-239, బుద్ధవరం రోడ్, గన్నవరం గ్రామపంచాయతి, గన్నవరం మండలం, 477-2, విజయవాడ-520010 (రెఫరెన్స్ నం. LHVJW00001358370). సరిహద్దులు: ఉత్తరం: డా॥ ఏకాంభరేశ్వర రావు, దక్షిణం: భద్దవరం రోడ్, తూర్పు: మహ్మద్ గాలిబీ ల్యాండ్, పడమర: ఎవి సుబ్బయ్య ల్యాండ్/ స్వాధీనతా తేది: 18-మే-24.	13-04-2023 Rs. 2,99,098/-	విజయవాడ-బి

పై పేర్కొన్న రుణగ్రహీతలు/ హామీదారులుకు బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటకు 30 రోజుల ప్రకటన ఇవ్వబడుచున్నది, లేని పిమ్మట సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8&9 క్రింద నియమాల ప్రకారం, తాకట్టుపెట్టబడిన ఆస్తులు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తరువాత విక్రయించబడుతుంది.

తేది: మే 23, 2024
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

మధురానగర్ బ్రాంచి
డి.నెం.21-9-2, మెయిన్ రోడ్డు, మధురానగర్, విజయవాడ, యన్‌టిఆర్ జిల్లా, ఎపి-520011. ఫోన్: 0866-2539390

లాకర్స్ ప్రకటన

వ.నెం.	లాకర్ నెంబర్	లాకరుదారుని పేరు
1	0340102	పొనుగుపాటి ప్రతిమ
2	0110076	రఫీ షేక్
3	0430063	నిశ్శంకరరావు వెంకటరత్నం
4	0020183	పిన్నిటి వాసు

పైన పేర్కొన్న ఖాతాదారులు మా బ్రాంచ్ నందు లాకర్ సౌకర్యం పొందియున్నారు. వారు గత కొద్ది సంవత్సరాలుగా అద్దె బకాయి పడ్డారు మరియు పై అడ్రస్‌కు పంపిన నోటీసులు తిరిగి వచ్చిన కారణంగా బ్యాంక్ నిబంధనల అనుసారం లాకర్స్ పగులగొట్టి అందులోని వస్తువులను స్వాధీనత తీసుకొనబడును. పై ఖాతాదారులు లేక వారికి సంబంధించిన వారెవరైనా ఈ ప్రకటనను నోటీసుగా భావించి సరైన ధృవపత్రాలతో ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి 7 రోజులలోగా బ్రాంచి మేనేజర్ వారిని సంప్రదించగలరు.

తేది.22-05-2024 — బ్రాంచి మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम एक परिवार एक बैंक

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
జోనల్ ఆఫీసు, విజయవాడ, 1వ అంతస్తు, ఇన్ఫినిటి ప్లాజా, డోర్ నం.59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్, పటమట, విజయవాడ, ఆం.ప్ర.-520007. టెలి: 0866-2431225.

AX76/Vijayawada/SARFAESI/2024-25 — 22/05/2024

(రూలు 8(1) స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారు, **బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర, చీఫ్ మేనేజర్, విజయవాడ జోన్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువబడే సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 05.12.2023** నాటి డిమాండ్ నోటీసు జారీచేసి, దిగువ రుణగ్రహీతలు & హామీదారులు **1. దేవిశ్రీ వేంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ (రుణగ్రహీత), యజమాని: అదప శివప్రసాద రావు,** ఆర్. అగ్రహారం, డోర్ నం.24-8-14, కోనేరు రోడ్, గుంటూరు, ఆం.ప్ర.-522003. **2. అదప శివప్రసాద రావు (రుణగ్రహీత),** సాయి మల్లికార్జున అపార్టుమెంట్, ఫ్లాట్ నం.404, 4వ అంతస్తు, 1వ లైన్, చుట్టుగుంట సెంటర్, గుంటూరు, ఆం.ప్ర.-522004. **3. మామిడి వెంకట కోటేశ్వర రావు (హామీదారు),** తండ్రి మామిడి ప్రభాకర్ రావు, డోర్ నం.13-2-42, 1వ లైన్, గుంటూరు వారి తోట, గౌది మఠం దగ్గర, గుంటూరు, ఆం.ప్ర.-522003. **4. జొన్నలగడ్డ మల్లేశ్వరి (హామీదారు),** భర్త రామ్‌మోహన్ రావు, డోర్ నం.2-28-ఎ, తక్కెల్లపాడు, గుంటూరు, ఆం.ప్ర.-522509 అనువారిని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా దిగువ పేర్కొనబడిన **రూ.1,14,26,427/- (రూపాయలు ఒక కోటి పద్నాలుగు లక్షల ఇరువై ఆరు వేల నాలుగు వందల ఇరువై ఏడు మాత్రమే) ప్లస్ 05.12.2023 నుండి వర్తించినట్లుగా అమలుచేయని వడ్డీ/తదుపరి వడ్డీ ప్లస్ ఖర్చులు& ఇతర వ్యయాలు మొ॥** వాటిని తిరిగి చెల్లించవలసిందిగా కోరబడుచున్నది. నోటీసును అక్నాలెడ్జిమెంట్ డ్యూ గల రిజిస్టర్డు పోస్టు మరియు స్పీడ్ పోస్టు ద్వారా పంపబడినది.
రుణగ్రహీత/తాకట్టుదారులు/హామీదారులు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు, హామీదారులు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **22.05.2024**న ఇందు దిగువ వివరించిన ఆస్తులను లాంఛనప్రాయ/ భౌతిక స్వాధీనంచేసుకొన్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీత/ తాకట్టుదారు/ హామీదారు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తులతో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తులతో లావాదేవీలు జరుపుట అనునది, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు పై పేర్కొన్న మొత్తాలను చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ 8 యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.
సెక్యూరిటీ వివరాలు: 120 రోజుల వరకు స్టాక్& డెటర్స్ యొక్క ప్రైమరీ హైపోతికేషన్ మరియు సంస్థ యొక్క ప్రస్తుత& భవిష్యత్ ఇతర కరెంట్ అసెట్స్.
బి) కొల్లెటరల్- ఎస్‌ఆర్ఒ గుంటూరు యొక్క సబ్-రిజిస్ట్రార్ పరిధిలో గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, రామచంద్రాపురం అగ్రహారం, కోనేరు రోడ్, బందరువారి వీధి, గుంటూరు యొక్క టి.ఎస్.నం.518, పాత డోర్ నం.24-9-21, 24-9-22 & 24-8-20, ప్రస్తుత డోర్ నం.24-8-14, పాత వార్డు నం.16, కొత్త వార్డు నం.28, బ్లాక్ నం.8, పాత అసెస్మెంట్ నం.32152, కొత్త అసెస్మెంట్ నం.1021098710 వద్దగల గ్రౌండ్ ఫ్లోర్ ఆర్‌సిసి రూఫ్ విస్తీర్ణం 201చ.గ.లు లేదా 168.07చ.మీ.లు రోడ్డు విస్తరణలో భాగంగా తరువాత విస్తరించిన ఏరియా 26చ.గ.లు, నికర విస్తీర్ణం 175చ.గ.లు కలిగియున్న కమర్షియల్ భవనము యొక్క ఈక్విటేబుల్ తాకట్టు. మరియు సరిహద్దులు: తూర్పు: అలపాటి సుబ్బారావు ఆస్తి, 50అ.ల 9 ఈంచులు, దక్షిణం: మున్సిపల్ రోడ్డు, 31-0అ.లు, పడమర: అదప వెంకట రమణ ఆస్తి, 24-0అ.లు తిరిగి దక్షిణం: డిటో వారి ఆస్తి, 12అ.ల 3 ఈంచులు, తిరిగి పడమర: మున్సిపల్ రోడ్డు, 5అ.ల 10 ఈంచులు, ఉత్తరం: మున్సిపల్ రోడ్డు, 6అ.ల 8 ఈంచులు. తిరిగి పడమర: మున్సిపల్ రోడ్, 24-0అ.లు తిరిగి ఉత్తరం: అదప శ్రీనివాస రావు ఆస్తి, 36అ.లు 9 ఈంచులు. అన్ని ఫిక్చర్స్, ఫర్నీచర్ మొ॥వాటి అన్నింటితో.

తేది: 23.05.2024
ప్రదేశం: విజయవాడ
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తరపున, అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్, విజయవాడ బ్రాంచి, విజయవాడ జోన్

DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
Ground & First Floors, 31-31-21, Sai Baba Street, Narayana Bhawan, Dabagardens, Visakhapatnam – 530020

OA No. 272 / 2021

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993
Union Bank of India (e-Andhra Bank) Brodipet Branch, Guntur - 522003.
Vs
M/s. Vishnavi Cottons

To,
Def 1 : M/s. Vishnavi Cottons, Prop : Addanki Hari Krishna, D.No. 3/29/43, Mahindra Residency, Krishna Nagar, Guntur, AP- 522006
Def 2 : Sri Addanki Hari Krishna, S/o. Nageswar Rao, R/o. D.No. 11-29-14, Ramireddypeta, Narasaraopeta, Guntur, AP- 522006
Def 3 : Sri Manchipalapudi Srinivasa Rao, S/o. Narasimha Rao, Flat No. 9, Bommarillu Apartment, 5th Lane, Rajendra Nagar, Guntur - 522006.
Def 4 : Sri Alapati Gopala Krishna, S/o. Nageswar Rao, D.No. 2-1-64, Stambalagaruvu, Ramalayam, Guntur City - 522006

PAPER PUBLICATION

Whereas OA 272/2021 was listed before Hon'ble Presiding Officer / Registrar on 31-05-2024.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue Summons / notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 2,26,81,238/-** (application along with copies of documents etc. annexed)
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under :
(I) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted:
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application:
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties:
(iv) You shall not transfer by way of sale, lease or otherwise except in the Ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal:
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before presiding Officer/ Registrar **on 31-05-2024 at 10.30 A.M.** failing the application shall be heard and decided in your absence.
Given under my hand and seal of this Tribunal on this date 08-05-2024.
Signature of the Officer
Authorised to issue summons

సంపాదకీయం

దిగ్భ్రాంతికరం

పోలింగ్ సందర్భంగానూ, ఆ తరువాత రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో చెలరేగిన హింస, ఘర్షణలు ప్రజాస్వామ్య ప్రక్రియకు సవాల్ విసురుతున్నాయి. కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లోనూ తాజా ఎన్నికలు చిచ్చురేపాయి. ఫ్యాక్షన్ భూతాన్ని మళ్లీ నిద్రలేపినట్టుగా వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. పోలింగ్ జరిగి వారాలు గడుస్తున్నా రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలు పోలీస్ పహారాలోనే కొనసాగుతున్నాయి. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాలతో పాటు మరికొన్ని చోట్ల కౌంటింగ్ తరువాత కూడా 25 రోజుల పాటు భద్రతా దళాలను మోహరించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ఇవన్నీ ఒక ఎత్తైతే, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు, పోలీస్ యంత్రాంగం దానికి భిన్నంగా ఉండటం, హింసాత్మక సంఘటనలపై దర్యాప్తు ప్రక్రియ లొసుగుల మయంగా మారడం మరో ఎత్తు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదికలో పేర్కొన్న ఈ అంశాలు పరిపాలనా వ్యవస్థ విశ్వసనీయతను చర్చనీయాంశం చేశాయి. ఈ హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్న వందలాది మంది ఆచూకీ ఇంకా తెలియకపోవడం మన పోలీస్ వ్యవస్థ పనితీరుకు మచ్చుతునక.

నిజానికి రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను ప్రహసనంగా మార్చిన ఘనత అటు అధికార వైసిపితో పాటు, ప్రతిపక్ష తెలుగుదేశానికి కూడా దక్కుతుంది. అధికారమే పరమావధిగా ఈ రెండు పార్టీల నేతలు వేసిన ఎత్తులు, అమలు చేసిన వ్యూహాలు, చేసిన ప్రసంగాలు ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఉద్రిక్త భరితంగా మార్చివేశాయి. పాలనా యంత్రాంగాన్ని అధికార వైసిపి ఏకపక్షంగా నడిపించగా, తెలుగుదేశం పార్టీ అధికార యంత్రాంగం నుండి లబ్ధి పొందడానికే బిజెపితో పొత్తు పెట్టుకున్నట్లు ప్రకటించింది. ఎన్నికల సంఘం నుండి సహకారం పొందేందుకే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో పొత్తు పెట్టుకుంటున్నట్లు ఆ పార్టీ బాహాటంగానే చెప్పింది. డిజిపితో సహా పలువురు అధికారుల బదిలీలు ఆ విషయాన్ని బలపరిచేలా ఉన్నాయి. ప్రజాస్వామ్యానికి ఊపిరి వంటి ఎన్నికల ప్రక్రియను తమ చర్యలతో మేనేజ్‌మెంట్ స్థాయికి ఈ రెండు పార్టీలు దిగజార్చాయి. ఈ వ్యవహారమంతా జరుగుతున్నప్పుడు చూస్తూ ఊరుకున్న ఎన్నికల కమిషన్ చేతులు కాలాక ఇప్పుడు ఆకులు పట్టుకోవడానికి ప్రయత్నిస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన మాచర్ల ఎంఎల్‌ఎ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఉదంతం కూడా ఇటువంటిదే! పోలింగ్ జరిగిన రోజు (13వ తేది) ఆయన ఇవిఎంను ధ్వంసం చేస్తే, వారం తరువాత ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తే కానీ, ఎన్నికల సంఘం స్పందించలేదు. పోలింగ్ రూమ్‌లోనూ, బూత్ వద్ద ఉన్న పార్టీల ఏజెంట్లు, సిబ్బంది, పోలీసుల సంగతి అటుంచితే, దూరం నుండి వెబ్ క్యాస్టింగ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించే ఎన్నికల అధికారుల సంగతేంటి? పోలీసుల ఎఫ్‌ఐఆర్‌లో గుర్తుతెలియని వ్యక్తులని రాయడంతో వెబ్ క్యాస్టింగ్‌ను 20వ తేది పరిశీలించినట్లు సిఇఓ తాజాగా చెప్పారు. అసలు సంఘటన జరుగుతుండగానే గుర్తించి, చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారు? మీడియాలో వచ్చిన తరువాత భుజాలు తడుముకోవడం దేనికి?

ఒకదాని తరువాత ఒకటిగా వెలుగులోకి వస్తున్న సంఘటనలు ఎన్నో సందేహాలను లేవనెత్తుతున్నాయి. ఉన్నత స్థాయి అధికారులతో పాటు, ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను ప్రశ్నార్థకంగా మార్చివేశాయి. ఘర్షణలకు సంబంధించి ఇంటెలిజెన్స్ నుండి ముందస్తు సమాచారం ఉందంటూ పోలింగ్ అనంతరం సాక్షాత్తు సిఇఓనే ప్రకటించారు. ఆ తరహా సమాచారమున్నా ఘర్షణలను నివారించలేని పరిస్థితి ఏర్పడటంపై ప్రజానీకంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకెన్ని ఘటనలు వెలుగు చూస్తాయో కూడా తెలియదు. భవిష్యత్తులోనైనా ఎన్నికలు సజావుగా జరుగుతాయన్న భరోసా రాష్ట్ర ప్రజలకు కలగాలంటే సిట్ ఇప్పటికే అందచేసిన ప్రాథమిక నివేదికను బహిర్గతం చేయాలి. నివేదికలో సిట్ పేర్కొన్న అంశాలపై చర్చ జరపడానికి పౌర సమాజానికి అవకాశం ఇవ్వాలి. భవిష్యత్‌లో జరిగే విచారణను మరింత పారదర్శకంగా నిర్వహించాలి. ఈ పరిస్థితికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

మహనీయుల మాట



రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మహిళ అభివృద్ధి సాధించనంత వరకు సామాజిక భద్రత రాదు. అందువల్ల పురుషాధిక్యత ఉన్న సమాజం గనుక మహిళలు ఉద్యమించాలి.

- వి.ఐ. లెనిన్

కపటత్వానికి ప్రతిరూపం ఆర్.ఎస్.ఎస్

విశ్లేషణ

ఎం.వి.ఎస్. శర్మ

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో బిజెపికి, దాని మిత్రులకు దేశమంతటా ఎదురు గాలులు వీస్తున్నాయి. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా, లోలోపల మోడీ అండ్ కో భయపడుతున్నారు. రానురాను మరింత ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టటం, ప్రతిపక్షాలపై పచ్చి అబద్ధాలను, పుకార్లను ప్రచారంలో పెట్టడం చేస్తున్నారు. స్వయానా మోడీయే ఈ పనిలో ముందున్నారు. అయినా ప్రయోజనం వుండేలా కనిపించడంలేదు.

ఈ పరిస్థితుల్లో ఒక కొత్త ప్రచారం తెర మీదికి వస్తోంది. మోడీ బృందానికి, ఆర్‌ఎస్‌ఎస్ అధినాయకత్వానికి మధ్య విభేదాలు పెరుగుతున్నాయన్నదే ఆ ప్రచార సారాంశం. ఈ మారు మోడీ కోరుతున్న 400 సీట్లు కాదుగదా మెజారిటీ అయినా ఎలా వస్తుందో చూస్తాం అని ఒక ద్వితీయ శ్రేణి ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు పత్రికా సమావేశం పెట్టి మరీ సవాలు చేసినట్టు ఒక వీడియో వైరల్ అవుతోంది. ఆర్‌ఎస్‌ఎస్‌ను మరిచిపోయి మోడీ తన స్వంత ఇమేజ్‌ను పెంచుకుంటున్నారని, రామాలయ ప్రారంభానికి కూడా ఆర్‌ఎస్‌ఎస్ నేతలను పిలవలేదని, గౌరవించలేదని....ఇలా ప్రచారం జరుగుతోంది.

ఈ ప్రచారం కూడా ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహంలో భాగమే. అప్రదిష్టపాలై ప్రజల్లో చెడ్డ పేరు వస్తే అదేదో మోడీ బృందానికి రావాలే తప్ప ఆ పాపం ఆర్‌ఎస్‌ఎస్‌కు అంటకూడదన్నదే ఆర్‌ఎస్‌ఎస్ విధానం. ఈ మారు ఒకవేళ మోడీ ఓడిపోయినా, ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగంలో వివిధ రాజ్యాంగ, రాజ్యాంగేతర వ్యవస్థల్లో లోతుగా చొచ్చుకుపోయిన నెట్‌వర్క్ ఆర్‌ఎస్‌ఎస్‌కు వుండనే వుంది. ఎన్‌డియేకు ప్రత్యామ్నాయంగా వేరే ప్రభుత్వం వచ్చినా, అందులోని భాగస్వాముల్లో సైతం మోడీ పట్ల వ్యతిరేకత వున్నా, ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వ పట్ల సానుభూతి, మెతకదనం ప్రదర్శించేవారు వున్నారు. కనుక వ్యూహాత్మకంగానే వెనకడుగు వేసినట్టు నటిస్తూ తన హిందూత్వ ఎజెండాను కొనసాగించడానికి ఆర్‌ఎస్‌ఎస్ ప్లాన్-బి రూపొందించినట్టు కనిపిస్తోంది.

ఇదేమీ ఆర్‌ఎస్‌ఎస్‌కి కొత్త కాదు. ఆ సంస్థ పుట్టుకే కపటత్వంలో మొదలైంది. సావర్కర్ అండమాన్ జైలులో వున్నపుడు క్షమాపణలు కోరుతూ రాసిన లేఖలు, అందులో బ్రిటిష్ వలస పాలకుల ఎడల ప్రదర్శించిన రాజభక్తి అందుకు మొదటి ఉదాహరణ. ప్రజలలో స్వాతంత్ర్యాభిలాష వుంది కనుక ముందు స్వాతంత్ర్యం కోసం పోరాడేందుకు రంగంలోకి దిగి, నిర్బంధం చవిచూడగానే వలస పాలకులకు దాసోహం అన్నాడు. ఆర్‌ఎస్‌ఎస్‌కి మూల పురుషుడిగా, సిద్ధాంతవేత్తగా పరిగణించబడే సావర్కర్ ప్రదర్శించిన కపటత్వం ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ నరనరాల్లో జీర్ణించుకుపోయింది.

> **ఈ మారు మోడీ కోరుతున్న 400 సీట్లు కాదుగదా మెజారిటీ అయినా ఎలా వస్తుందో చూస్తాం అని ఒక ద్వితీయ శ్రేణి ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు పత్రికా సమావేశం పెట్టి మరీ సవాలు చేసినట్టు ఒక వీడియో వైరల్ అవుతోంది. ఆర్‌ఎస్‌ఎస్‌ను మరిచిపోయి మోడీ తన స్వంత ఇమేజ్‌ను పెంచుకుంటున్నారని, రామాలయ ప్రారంభానికి కూడా ఆర్‌ఎస్‌ఎస్ నేతలను పిలవలేదని, గౌరవించలేదని....ఇలా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారం కూడా ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహంలో భాగమే. అప్రదిష్టపాలై ప్రజల్లో చెడ్డ పేరు వస్తే అదేదో మోడీ బృందానికి రావాలే తప్ప ఆ పాపం ఆర్‌ఎస్‌ఎస్‌కు అంటకూడదన్నదే ఆర్‌ఎస్‌ఎస్ విధానం.**

> **వాజ్‌పేయి ప్రధానిగా వున్నా, ఇప్పుడు మోడీ ప్రధానిగా వున్నా వాళ్ల హయాంలో సాధ్యమైన మేరకు అమలు జరిపింది సంఘ పరివార్ ఎజెండానే. ఆ ఎజెండా అమలులో ఆర్‌ఎస్‌ఎస్‌కి పూర్తి ఏకీభావం వుంది. కార్పొరేట్లకు దోచిపెట్టడం ఆర్‌ఎస్‌ఎస్ విధానమే. నిరంకుశత్వం ఆర్‌ఎస్‌ఎస్ విధానమే. మోడీకి వేరే ఎజెండా లేదు. ఇప్పుడు మోడీ ప్రభుత్వానికి ఎదురుగాలి వీస్తోంది. ఆ గాలికి కొట్టుకుపోతే మోడీ బృందం పోవాలి తప్ప ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ మాత్రం చెక్కు చెదరకూడదు. అందుకోసం అవసరమైతే మోడీని దూరం పెడతారు. తామేదో పవిత్రులమన్నట్టు పోజు పెడతారు. ఈ నయవంచన ఆర్‌ఎస్‌ఎస్‌కు వెన్నతో పెట్టిన విద్య.**

ప్రజలలో ముస్లింల పట్ల విద్వేషాన్ని రగిల్చే విష ప్రచారం చేసే సంఘపరివారం సింధ్, బెంగాల్ ప్రావిన్షియల్ ప్రభుత్వాలలో ముస్లింలీగ్‌తో కలిసి (1946లో) అధికారం పంచుకుంది.

అఖండ భారత్ గురించి ప్రచారం చేసి ఆఫ్ఘనిస్తాన్ నుంచి బర్మా దాకా వున్న ఉపఖండం యావత్తూ హిందూ దేశమేనని తప్పుడు ప్రచారం చేయడం ఆర్‌ఎస్‌ఎస్ విధానం. కాని ముస్లిం లీగ్ మాదిరిగానే ద్విజాతి సిద్ధాంతాన్ని బలపరిచి దేశ విభజనకు దోహదం చేసింది.

విభజన వెనువెంటనే దేశవ్యాప్త మత కల్లోలాలకు తెరతీసింది ఆర్‌ఎస్‌ఎస్. మహాత్ముడు నిరశన దీక్షకు పూనుకుని ప్రజల మధ్య సామరస్యం నెలకొనాలని విజ్ఞప్తి చేస్తే, దేశ వ్యాప్తంగా వచ్చిన స్పందన చూసి సంఘ పరివారం నేతలు గాంధీ దగ్గరకు పోయి దీక్షకు సంఘీభావం ప్రకటించి వచ్చారు.

కొద్ది రోజుల్లోనే, అంతా సద్దు మణుగుతుంది అనుకున్నప్పుడు గాంధీజీని హత్య చేశారు. ఈ కుట్ర వెనుక సావర్కర్ హస్తం వుందని స్పష్టం అయ్యింది. వెంటనే ఆర్‌ఎస్‌ఎస్ తమ సంస్థకు, గాంధీ హత్యకు సంబంధం లేదని... సావర్కర్‌కు, ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధం లేదని ప్రకటించింది. చెడ్డ పేరు వస్తే గాడ్సేకు, సావర్కర్‌కు రావాలి తప్ప ఆ మకిలి ఆర్‌ఎస్‌ఎస్‌కు అంటకూడద న్నదే వాళ్ల విధానం. మళ్లీ మోడీ ప్రధాని అయ్యాక సావర్కర్‌ను, గాడ్సేను ఆకాశానికెత్తే ప్రచారం ప్రారంభించారు. అవకాశవాదం ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహం.

జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో 1974లో ఇందిరాగాంధీ నియంతృత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం మొదలైంది. భారతీయ జన సంఘం (ప్రస్తుత బిజెపికి అప్పటి పేరు) అందులో భాగస్వామి అయ్యింది. 1975లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించి ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం ప్రకటించింది. వెంటనే ఆర్‌ఎస్‌ఎస్ అధినేత బాలా సాహెబ్ దేవరస్ ఎమర్జెన్సీకి మద్దతు ప్రకటించాడు. జె.పి ఉద్యమానికి, ఆర్‌ఎస్‌ఎస్ కి సంబంధం లేదని ప్రకటించాడు. ఎమర్జెన్సీని ప్రజలు తిరస్కరించిన తర్వాత ఆర్‌ఎస్‌ఎస్ నేతలు నియంతృత్వాన్ని ఓడించింది తామేనని చెప్పుకుంటూ తిరగడం మొదలుబెట్టారు.

నియంతృత్వాన్ని ఓడించి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన జనతా పార్టీ ముక్కలై మళ్లీ ఇందిరా గాంధీ గద్దెనెక్కారు. జనతా పార్టీ ముక్కలు కావడానికి ప్రధాన కారణం ఆర్‌ఎస్‌ఎస్ అనేది అందరికీ తెలుసు.

అయోధ్యలో రామ మందిరం నిర్మిస్తాం అంటూ దేశమంతటా తిరిగారు. కాని అక్కడ బాబ్రీ మసీదును కూల్చివేశారు. దానిపై దేశమంతటా వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. వెంటనే ఆర్‌ఎస్‌ఎస్ తమకు, మసీదు విధ్వంసానికి సంబంధం లేదని ప్రకటించింది. గుజరాత్ మారణ హోమం విషయంలో కూడా అదే వైఖరి తీసుకున్నారు. ప్రపంచం యావత్తూ ఆనాడు మోడీ ప్రభుత్వాన్ని (2002లో) ఖండించింది కనుక వాజ్‌పేయి కూడా ఖండించారు. కాని మోడీ ప్రభుత్వానికి ఢోకా లేకుండా చూసుకున్నారు.

ఇప్పుడు కూడా వారిది అదే వైఖరి. దేశంలో విజయాలు ఏవైనా సాధిస్తే ఆ ఘనతనంతటినీ వాళ్ల ఖాతాలోకి వేసుకుంటారు. బిజెపి గాని ఆర్‌ఎస్‌ఎస్ గాని దేశానికి చేసిందేమీ లేదు. కాని అంతా తమ ఘనతేనంటారు. అదే పేదరికం, అవినీతి, నిరుద్యోగం, ఆకలి వంటి అంశాలు చర్చకొస్తే ఆ పాపం అంతా 2014కు ముందు పాలించిన వారిదేనంటారు.

వెరసి, ప్రజలు నిజానిజాలు గ్రహించి స్పందించిన ప్రతీ సందర్భంలోనూ ఆర్‌ఎస్‌ఎస్ కొందరు అనుయాయుల్ని ఎంచి బలిపశువులను చేస్తుంది. తాను తప్పుకుంటుంది. తనకేమీ సంబంధం లేదంటుంది. మళ్లీ ప్రజలు తన హిందూత్వ మాయాజాలంలో చిక్కుతూంటే తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంది.

వాజ్‌పేయి ప్రధానిగా వున్నా, ఇప్పుడు మోడీ ప్రధానిగా వున్నా వాళ్ల హయాంలో సాధ్యమైన మేరకు అమలు జరిపింది సంఘ పరివార్ ఎజెండానే. ఆ ఎజెండా అమలులో ఆర్‌ఎస్‌ఎస్‌కి పూర్తి ఏకీభావం వుంది. కార్పొరేట్లకు దోచిపెట్టడం ఆర్‌ఎస్‌ఎస్ విధానమే. నిరంకుశత్వం ఆర్‌ఎస్‌ఎస్ విధానమే. మోడీకి వేరే ఎజెండా లేదు.

ఇప్పుడు మోడీ ప్రభుత్వానికి ఎదురుగాలి వీస్తోంది. ఆ గాలికి కొట్టుకుపోతే మోడీ బృందం పోవాలి తప్ప ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ మాత్రం చెక్కు చెదరకూడదు. అందుకోసం అవసరమైతే మోడీని దూరం పెడతారు. తామేదో పవిత్రులమన్నట్టు పోజు పెడతారు.

అభిప్రాయం

విదేశాల్లో ఉద్యోగమా? అప్రమత్తత అవసరం

'విదేశాల్లో పెద్ద ఉద్యోగం. ఏసీ రూముల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ పని. రూ.లక్షల్లో సంపాదన' అని చెప్పి నిరుద్యోగ యువతను నమ్మించి విదేశీ ముఠాలకు విక్రయిస్తున్న ముగ్గురు సభ్యులను విశాఖ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. అంతే కాకుండా చాలా మంది గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాల పేరుతో విజిటింగ్ వీసాలపై పంపి మోసం చేస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. అందుకే విదేశాల్లో ఉద్యోగం అంటే ఒకటికి రెండు సార్లు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

విజిటింగ్, స్టూడెంట్ వీసాలపై..

టర్కీ సమీపంలోని అజర్ బైజాన్‌కు 29 మందిని స్టూడెంట్ వీసాపై తీసుకెళ్లి...ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేసిన ఘటన గతంలో శ్రీకాకుళంలో వెలుగుచూసింది. అక్కడి పోలీసులు గుర్తించి బాధితులను ఇండియాకు తిరిగి పంపించారు. విశాఖపట్నంలో ఓ కన్సల్టెన్సీ సంస్థ సౌదీలో రెండేళ్ల పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని 76 మంది నుంచి రూ. 60వేల చొప్పున వసూలు చేసింది. విజిటింగ్ వీసాపై సౌదీకి తీసుకెళ్లి పని కల్పించింది. అయితే ఆరు నెలలకే వీసా గడువు ముగియడంతో ఆ దేశం వారందరినీ ఇండియాకు వెనక్కి పంపించేసింది. బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు.

డబ్బులు వసూలు చేసి..

విదేశాల్లో ఉద్యోగాల ఆశ చూపి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటనలు గతంలో అనేకం వెలుగుచూశాయి. స్వీడన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విశాఖలో ఓ సంస్థ నిరుద్యోగులకు టోకరా వేసింది. 70 మంది నుంచి రూ.కోటి వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. యూరప్, మలేషియా పంపిస్తామని ఏజెంట్లు మోసం చేశారని జగిత్యాలలో చాలా మంది పోలీసులను ఆశ్రయించారు. అంతేకాకుండా తెలుగు రాష్ట్రాలలో గల్ఫ్ మోసాలు తరచూ బయటపడుతూనే ఉంటాయి. గల్ఫ్ పంపిస్తానని నిజామాబాద్ జిల్లాలో ఓ ఏజెంట్ రూ. 4 కోట్ల వరకు వసూలు చేసి పరారయ్యాడు.

హెచ్చరిస్తున్న విదేశీ మంత్రిత్వ శాఖ

విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలు ఎక్కువగా తూర్పు ఐరోపా దేశాలు, గల్ఫ్ కంట్రీస్, ఇజ్రాయిల్, కెనడా, మయన్మార్ వెళ్లే నిరుద్యోగులకు ఎదురవుతున్నట్లు భారత విదేశాంగ శాఖ గుర్తించింది. అందుకే విదేశాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు చేయాలనుకుంటే రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెంట్లను మాత్రమే సంప్రదించాలని, చట్టపరమైన నిబంధనలను అనుసరించి మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచిస్తున్నది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడేవారు ఎక్కువగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారానే సంప్రదిస్తున్నారని, తమ ఆఫీసు అడ్రస్‌గానీ, ఇంటి అడ్రస్‌గానీ తెలియనివ్వడం లేదని గుర్తించింది. అందుకే రిజిస్టర్డ్ ఏజెంట్లందరూ తమ కార్యాలయం ఎదుట ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్‌ను కచ్చితంగా డిస్‌ప్లే చేయాలని కేంద్రం ఆదేశించింది. ప్రభుత్వ గుర్తింపు లేని రిక్రూటింగ్ ఏజెంట్లెవరైనా నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి విదేశాలకు పంపిస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించింది. ఇమ్మిగ్రేషన్ చట్టం-1983 ప్రకారం ఇది మానవ అక్రమ రవాణా కిందికి వస్తుందని స్పష్టం చేసింది. కాని మోసాలు జరుగుతూనే వున్నాయి. కట్టడి కరువౌతోంది.

నిశిత పరిశీలన అవసరం

మెరుగైన ఉపాధి కోసం చాలా మంది భారతీయులు విదేశాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే చాలా మంది నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోతూ, ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అందుకే విదేశీ ఉద్యోగ ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రిజిస్టర్ చేయని రిక్రూట్‌మెంట్ ఏజెంట్ల ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవద్దని పేర్కొంటున్నారు. ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారు ముందుగా ఏజెంట్ వివరాలను తెలుసుకోవాలి. విదేశాంగ శాఖలో ఏజెంట్‌గా నమోదు చేసుకున్నారా లేదా పరిశీలించాలి. ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ నంబర్ చెక్ చేయడానికి emigrate.gov.in అనే భారత ప్రభుత్వ వెబ్‌సైట్‌ను విజిట్ చేయాలి. అసలైన ఏజెంట్ల రిజిస్ట్రేషన్ నంబర్లు ఈ వెబ్‌సైట్‌లో లిస్ట్ అయి ఉంటాయి. అంతేకాకుండా ఆఫర్ లెటర్‌ను నిశితంగా పరిశీలించాలి. ఉద్యోగ నిబంధనలు, షరతులతో పాటు జీతం, జాబ్ కాంట్రాక్ట్ వివరాలు లేకుంటే ఆ ఆఫర్ లెటర్ మోసపూరితమని గ్రహించాలి.

- మహమ్మద్ ఆరిఫ్,
7013147990

దశాబ్ది కాలంలో ఉన్నత విద్య అధోగతి

చర్చ

దక్షిణాఫ్రికా లోని ఒక విశ్వవిద్యాలయ శిలాఫలకం మీద ఇలా వుంది. "ఏ దేశమైనా నాశనమవ్వడానికి అణుబాంబులు అక్కర్లేదు. అణ్వస్త్ర ఆయుధాలు అంతకంటే అక్కర్లేదు. ఆ దేశంలో లోపభూయిష్టమైన, నిర్వీర్యమైన విద్యావ్యవస్థ అన్ని వ్యవస్థలను నీచ స్థితికి దిగజార్చుతుంది".

నేడు దేశవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలు విశ్వ విద్యాలయాలలో విద్యా ప్రమాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గణితం, సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్‌లలో పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం వరుసగా 32 శాతం, 35 శాతం, 37 శాతం, 43 శాతంగా నమోదయ్యాయని 'నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వే' పేర్కొన్నది. 2017 నాటి జాతీయ సర్వేతో పోల్చితే, 2021 సర్వేలో సగటు ఫలితాలు పడిపోయాయని తెలిపింది. తమిళనాడు, తెలంగాణ, మేఘాలయ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జాతీయ సగటు కన్నా దిగువన ఫలితాలు నమోదయ్యాయి. ముఖ్యంగా కరోనా సంక్షోభం విద్యార్థుల చదువుల్ని కకావికలం చేసింది. సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన కుటుంబాల పిల్లలకు ఆన్‌లైన్ చదువులు అందుబాటులో ఉన్నాయని, మిగతావారికి కష్టసాధ్యమైందని సర్వే ఫలితాలు తెలిపాయి. ఆన్‌లైన్ ద్వారా సమాన విద్యావకాశాలు పూర్తిగా సన్నగిల్లాయని సర్వేలు చెబుతున్నా దిద్దుబాటు చర్యలకు ప్రభుత్వాలు పూనుకోవడం లేదు. భాషా నైపుణ్యం, పర్యావరణ శాస్త్రం, సైన్సు, గణితం, సామజిక శాస్త్రాలలో పిల్లలు వెనుకబడ్డారు. తాజాగా కాగ్ నివేదిక ఆసక్తికర అంశాలను బయట పెట్టింది. ఐఐటి, ఎన్ఐటి లలో పీజీ, పిహెచ్‌డి కోర్సుల్లో ఏటా సీట్లు భారీగా మిగిలి పోతున్నాయని వెల్లడించింది.

ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో పరిశోధన పడకేసి దశాబ్దం అవుతున్నది. ప్రతి సంవత్సరం నిర్వహించాల్సిన రీసెట్ ఎంట్రన్స్ పరీక్ష మూడు సంవత్సరాలకొకసారి నిర్వహిస్తూ ఇంటర్వ్యూలు అడ్మిషన్లకు సంవత్సర కాలం తీసుకుంటున్నారు. చాలా విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులు లేక విభాగాలు మూసివేశారు. నకిలీ విశ్వవిద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. 2020లో అడ్మిట్ అయిన స్కాలర్‌కు 2022 పట్టా ఇస్తున్నారు. విశ్వవిద్యాలయంలో కంప్యూటర్, ఎంబిఏ విభాగాలలో చదువు చెప్పేవారే లేరు.

> **రెండు తెలుగు రాష్ట్రాలలో పరిశోధన పడకేసి దశాబ్దం అవుతున్నది. ప్రతి సంవత్సరం నిర్వహించాల్సిన రీసెట్ ఎంట్రన్స్ పరీక్ష మూడు సంవత్సరాలకొకసారి నిర్వహిస్తూ ఇంటర్వ్యూలు అడ్మిషన్లు సంవత్సర కాలం తీసుకుంటున్నారు. చాలా విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులు లేక విభాగాలు మూసివేశారు. నకిలీ విశ్వవిద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. 2020లో అడ్మిట్ అయిన స్కాలర్‌కు 2022కు పట్టా ఇస్తున్నారు. విశ్వవిద్యాలయంలో కంప్యూటర్, ఎంబిఏ విభాగాలలో చదువు చెప్పేవారే లేరు. బాసరలో వెలసిన ట్రిపుల్ ఐఐటి పరిస్థితి ఎలా ఉందో అనంతపురంలో వెలసిన కేంద్ర విశ్వవిద్యాలయం పరిస్థితి అలాగే ఉంది. అక్కడ వి.సి, అధ్యాపకులు లేరు. మౌలిక సదుపాయాలు లేవు.**

బాసరలో వెలసిన ట్రిపుల్ ఐఐటి పరిస్థితి ఎలా ఉందో అనంతపురంలో వెలసిన కేంద్ర విశ్వవిద్యాలయం పరిస్థితి అలాగే ఉంది. అక్కడ వి.సి, అధ్యాపకులు లేరు. మౌలిక సదుపాయాలు లేవు. ఇక్కడ కేంద్ర విశ్వవిద్యాలయం పెట్టి ఏడు సంవత్సరాలు కావస్తున్నా అద్దె భవనంలోనే ఉంది. అక్కడ ఉన్న శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, కాకతీయ విశ్వవిద్యాలయాలలో పట్టుమని పది మంది శాశ్వత అధ్యాపకులు లేరు. చివరికి వంద సంవత్సరాల ఘన కీర్తి ఉన్న ఉస్మానియాలో అరవై మంది అధ్యాపకులు లేరు. ఆంధ్రాలో వెలసిన నన్నయ్య, యోగి వేమన, ద్రావిడ, అంబేద్కర్, విక్రమ్ సింహపురి, పద్మావతీ, రాయలసీమ విశ్వవిద్యాలయాలలో పట్టుమని పదిమంది శాశ్వత అధ్యాపకులు లేరు. కర్నూల్ జిల్లాలో రాయలసీమ విశ్వవిద్యాలయం, ఐఐటిడిఎం, ఆంధ్రప్రదేశ్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఉన్నాయి. అవి ఎలా ఉన్నాయనే సంగతి పక్కన పెడితే ఇప్పుడు కొత్తగా జగన్నాథ గట్టు దగ్గర క్లస్టర్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. అధ్యాపకులు లేక కీలక విభాగాలు మూసివేతకు గురైనాయి. పొలిటికల్ సైన్స్, పాలిమర్ సైన్స్, స్టాటిస్టిక్స్, సెరికల్చర్, జువాలజీ, బయో కెమిస్ట్రీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఎకనామిక్స్, హిస్టరీ, సోషల్ వర్క్, రూరల్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమెటిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని విభాగాల్లోను ఒకే ఒక్కరితో నడుపుతున్నారు. ఇక్కడ పని చేసే శాశ్వత అధ్యాపకులు మైనర్, మేజర్ రీసర్చ్ ప్రాజెక్టులకు అప్లై చేసిన పాపాన పోవడం లేదు. రీసర్చ్ గ్రాంట్ అనేది తెలియని స్థితిలో అధ్యాపకులు ఉన్నారు. రీసర్చ్ గ్రాంట్లే కాదు కాన్ఫరెన్సులు, సెమినార్, ఫ్యాకల్టీ డెంట్ ప్రోగ్రాంలకు, స్టాఫ్ డెవలప్‌మెంట్ కోర్సులు, రిఫ్రెషర్, ఓరియంటేషన్ కోర్సులు దశాబ్ద కాలంలో జరగలేదు. అకడమిక్ స్టాఫ్ కాలేజీలు, ఎలక్ట్రానిక్ మల్టీ మీడియా రీసర్చ్ సెంటర్లు నిధులు లేక వెలవెలబోతున్నాయి. ఇక ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, జువాలజీ, వృక్ష శాస్త్ర విభాగంలో టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండర్లు లేక ప్రయోగశాలలు మూతపడ్డాయి.

యుజిసి, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇతర నియంత్రణ సంస్థల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు విశ్వవిద్యాలయాల అడ్డు అదుపు లేకుండా పోయింది. అడుగు వ్యవసాయ భూమి లేకపోయినా అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ కోర్సులు నడుపుతూ ఎలాంటి గుర్తింపు లేకున్నా విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెడుతున్న విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వాలకు అదుపు లేకుండా పోయింది. రాష్ట్రంలో కొన్ని నర్సింగ్, బిఎస్సి అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు షాపింగ్ కాంప్లెక్స్ లోను, కమర్షియల్, లాడ్జిలో, అద్దె భవనాలలో ఉంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సువిశాలమైన అత్యాధునిక వసతులతో శాశ్వత భవనాలు అని ప్రచారం చేస్తూ ఏడు సంవత్సరాలుగా కాలం వెళ్ళబుచ్చుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. బిఎస్సి అగ్రికల్చర్, బిఎస్సి హార్టికల్చర్, బిఎస్సి ఫారెస్ట్రీ, ఎంబిఏ అగ్రికల్చర్....ఏ ఒక్క కోర్సుకు ఐ కార్ అనుమతి లేదు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసర్చ్ గుర్తింపు ఉండాలంటే కనీసం వంద ఎకరాల వ్యవసాయ భూమి ఉండాలి. ఇలాంటి విశ్వవిద్యాలయాలకు సెంటు భూమి లేదు. కళాశాలలో అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ కోర్సులు బోధించడానికి పట్టుమని నలుగురు అధ్యాపకులు ఉండరు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఉప కులపతులు, కులపతులు ఎక్కువగా నియంత్రణ మండళ్లల్లో పని చేసి రిటైర్ అయిన వారిని నియమించడం జరుగుతుంది.

ఎందుకంటే వీరి పరపతి ఉపయోగించి కోర్సులకు అప్రూవల్ తెస్తారని ధీమా. ఇలాంటి విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల విద్యనభ్యసించే విద్యార్థులకు వ్యవసాయంపై కనీస అవగాహన ఉండదు. అగ్రానమి, సాయిల్ సైన్స్, క్రాప్ ప్రొడక్షన్, హార్వెస్టింగ్, పెస్ట్ కంట్రోల్, ప్లాంట్ పాథాలజీ, వీడ్ మేనేజ్‌మెంట్, పెస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన లేదు. సుదూర ప్రాంతాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి పిల్లలు ఇలాంటి విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్నారు. మూడు నాలుగు సంవత్సరాల తరువాత ఐ కార్ గుర్తింపు లేని, వ్యవసాయంపై కనీస అవగాహన లేని విద్యార్థులకు వీళ్ళిచ్చే సర్టిఫికెట్‌తో ఎవరికీ ఉద్యోగం రాదు. కనీసం వీరికి ఏమైనా వ్యవసాయం, ఫలసాయం, ఫారెస్ట్రీపై ఏమైనా ప్రవేశం ఉన్నదా అంటే అదీ లేదు. రాష్ట్రంలో చాలా ప్రైవేటు విశ్వవిద్యాలయాలు రీసర్చ్ సూపర్‌వైజర్లు లేకున్నా పిహెచ్‌డిలు నడుపుతున్నాయి. రీసర్చ్ విభాగం ఉండదు, గైడ్లు ఉండరు. ఎక్కడో ఉత్తరాదిన ఇలాంటి బోగస్ విశ్వవిద్యాలయాలు ఉండేవి. అనంతపురంలో వెలసిన ప్రైవేటు విశ్వవిద్యాలయం పట్టుమని ముగ్గురు డాక్టరేట్లు లేరు. 28 కోర్సులలో పిహెచ్‌డి ప్రవేశ పరీక్షలు నిర్వహించింది. ఐదు వేలు అప్లికేషన్ ఫీజు, రూ.25000 అడ్మిషన్ ఫీజు, ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు ట్యూషన్ ఫీజు. విదేశీ విద్యార్థులు రీసర్చ్ స్కాలర్లుగా ఉన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు రీసర్చ్ గ్రాంట్లు లేవు. ఉన్న అరకొర నిధులు, బ్లాక్ గ్రాంట్లు జీతభత్యాలకు సరిపోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర మాని విద్యారంగంలో చోటు చేసుకుంటున్న ఇటువంటి అవకతవకలను సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- డా.యం.సురేష్ బాబు,
9989988912

ఏడో దశలో 908 మంది అభ్యర్థులు

- ఎనిమిది రాష్ట్రాలు, 57 స్థానాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జూన్ 1న జరగబోయే ఏడో, చివరి దశలో ఎనిమిది రాష్ట్రాల్లో 57 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ స్థానాల్లో మొత్తం 908 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ మేరకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. 57 స్థానాలకు మొత్తం 2,105 నామినేషన్లు దాఖలు కాగా, 954 నామినేషన్లు మాత్రమే ఆమోదం పొందాయి. నామినేషన్లు ఉపసంహరణ తరువాత 908 నామినేషన్లు మిగిలిన ఉన్నాయి. పంజాబ్(13)లో 328, ఉత్తరప్రదేశ్(13)లో 144, బీహార్(8)లో 134, పశ్చిమ బెంగాల్(9)లో 124, ఒరిస్సా(6)లో 66, జార్ఖండ్(3)లో 52, హిమాచల్ ప్రదేశ్(4)లో 37, చండీగఢ్(1)లో 19 మంది బరిలో ఉన్నారు.

పరువునష్టం కేసులో... రాహుల్‌కు రాంచీ కోర్టు సమన్లు

జంషెడ్‌పూర్ : కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీకి రాంచీలోని కోర్టు సమన్లు జారీ చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను 'హత్య కేసులో నిందితుడి'గా సంబోధించినందుకు రాహుల్‌పై పరువునష్టం కేసు నమోదైంది. రాంచీ సివిల్ కోర్టులో బిజెపి మద్దతుదారు దాఖలు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో రాహుల్‌కు సమన్లు జారీ చేశారు. తనపై నమోదైన పరువునష్టం కేసుకు సంబంధించి రాంచీ కోర్టులో జరుగుతున్న విచారణను కొట్టివేయాల్సిందిగా రాహుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జార్ఖండ్ హైకోర్టు ఫిబ్రవరిలో తోసిపుచ్చింది.

2018 మార్చి 18న న్యూఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో రాహుల్ ప్రసంగిస్తూ హత్య కేసులో అమిత్ షా నిందితుడని తెలిపారు. దీనిపై బిజెపి మద్దతుదారు ఝా ఫిర్యాదు చేయడంతో రాహుల్‌పై కేసు నమోదైంది. కాగా సమన్ల తేదీ ఇంకా తెలియలేదని రాహుల్ న్యాయవాది చెప్పారు.

మాలీవాల్‌కు న్యాయం జరుగుతుంది : కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఆమ్ రాజ్యసభ ఎంపి స్వాతి మాలీవాల్‌పై దాడి కేసు విషయంలో కేజ్రీవాల్ బుధవారం తొలిసారిగా స్పందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరగడంతో పాటు మాలీవాల్ న్యాయం అందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. మాలీవాల్‌పై కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్‌కుమార్ దాడి చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై 'ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుగుతుందని ఆశిస్తున్నా. న్యాయం జరగాలి. ఈ కేసులో రెండు కోణాలు ఉన్నాయి. ఇద్దరి నుంచి నిష్పక్షపాతంగా విచారణ జరిపినప్పుడే సరైన న్యాయం అందుతుంది. ప్రస్తుతం ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున.. ఏమీ మాట్లాడలేను' అని పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ పేర్కొన్నారు.కాగా, కేసులో బిభవ్‌ను అరెస్టు చేసిన ఢిల్లీ పోలీసులు ముంబయికి తీసుకెళ్లారు. స్వాధీనం చేసుకున్న నిందితుడి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, సీసీటీవీ రికార్డులను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు.

కోల్‌కతా హైకోర్టు సంచలన తీర్పు

- 2011 నుంచి ఇచ్చిన ఒబిసి సర్టిఫికేట్లు రద్దు

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వానికి మరొక గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 26వేల మంది టీచర్ల ఉద్యోగాలు రద్దు చేసిన కలకత్తా హైకోర్టు బుధవారం మరో సంచలన తీర్పు వెలువరించింది. ఒబిసిలో పలు క్లాసులను కొట్టివేసింది. 2011 తర్వాత నుంచి అంటే మమతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అన్ని ఒబిసి ధ్రువపత్రాలను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. 2012 పశ్చిమబెంగాల్ ఒబిసి చట్టంలోని కొన్ని నిబంధనలు చట్టవిరుద్ధంగా ఉన్నాయంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. 2010-12 మధ్య రాష్ట్ర ప్రభుత్వం ఒబిసి వర్గీకరణలుగా పేర్కొన్న 42 క్లాసులను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది. ఆ వర్గీకరణలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని స్పష్టంచేసింది.

సామాన్యుడికి ఊరటేది?

- చమురు ధరలు తగ్గినా ఒరిగిందేమీ లేదు
- లాభాలు దండుకుంటున్న ఆయిల్ కంపెనీలు
- డివిడెండ్ల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి కాసుల పంట

న్యూఢిల్లీ : మార్చి 31తో అంతమైన 2023-24 ఆర్థిక సంవత్సరంలో చమురు కంపెనీల లాభాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినప్పటికీ మన ఆయిల్ కంపెనీలు మాత్రం సంవత్సరం పొడవునా ఇంధన ధరలను తగ్గించనే లేదు. చమురు కంపెనీలకు లాభాల పంట పండడానికి ఇదే కారణం. మరో మాటలో చెప్పాలంటే చమురు మార్కెటింగ్ కంపెనీలు తమ లాభాలను పెంచుకుంటుంటే సామాన్య ప్రజలకు మాత్రం ఎలాంటి ఊరట లభించలేదు. డివిడెండ్లు చెల్లిస్తామని చమురు కంపెనీలు హామీ ఇవ్వడంతో ప్రభుత్వం కూడా లాభపడుతోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో డివిడెండ్ల రూపంలో ప్రభుత్వానికి సమకూరిన ఆదాయంతో పోలిస్తే గత సంవత్సరం వచ్చిన ఆదాయం అనేక రెట్లు అధికంగా ఉంది.

ప్రభుత్వ రంగంలోని చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసిఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్) 2023-24లో రూ.80,986 కోట్ల లాభాన్ని మూటకట్టుకున్నాయి. 2022-23లో ఆ కంపెనీలు ఆర్జించిన లాభంతో పోలిస్తే ఇది నాలుగు రెట్ల కంటే ఎక్కువే. ఐఒసీఎల్, బిపిసిఎల్‌ను ప్రభుత్వమే నేరుగా నిర్వహిస్తోంది. హెచ్‌పిసిఎల్ మాత్రం మరో ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జిసికి అనుబంధంగా ఉంది.

ఆయిల్ కంపెనీల లాభాలు ఇవే

ఐఒసిఎల్ 2021-22లో రూ.24,184 కోట్లు, 2022-23లో రూ.8,242 కోట్లు, 2023-24లో రూ.39,619 కోట్ల లాభాలు పొందింది. బిసిపిఎల్ 2021-22లో రూ.8,789 కోట్లు, 2022-23లో రూ.1,870 కోట్లు, 2023-24లో రూ.26,874 కోట్ల లాభాలు ఆర్జించింది. హెచ్‌పిసిఎల్ 2021-22లో రూ.39,335 కోట్లు, 2022-23లో రూ.19,086 కోట్లు, 2023-24లో రూ.80,986 కోట్ల లాభాలు సంపాదించింది.

చమురు కంపెనీలు ఏం చేస్తాయి?

చమురు మార్కెటింగ్ కంపెనీలు చేసే ప్రధానమైన పనులు ఏమిటంటే ముడి చమురును కొనుగోలు చేయడం, దానిని పెట్రోల్, డీజిల్, నాఫ్తా, లూబ్రికెంట్లు వంటి పెట్రోలియం ఉత్పత్తులుగా ప్రాసెస్ చేయడం, ఆ తర్వాత వాటిని మార్కెట్‌లో విక్రయించడం. చమురు మార్కెటింగ్ కంపెనీల లాభాలను ముఖ్యంగా రెండు అంశాలు ప్రభావితం చేస్తాయి. ఒకటి చమురు ధరలు. రెండు పెట్రోలియం ఉత్పత్తుల అమ్మకం ధరలు.

తొలుత వినియోగదారులకు ఊరట

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత అంటే 2022 జూన్‌లో బ్యారల్ చమురును 116 డాలర్ల గరిష్ట ధరకు భారత్ కొనుగోలు చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ జరిపిన తర్వాత మన దేశంలో కొన్ని నెలల పాటు పెట్రోల్, డీజిల్ ధరలు భగ్గుమన్నాయి. లీటరు పెట్రోలు ధర రూ.110కి చేరింది. 2022 ఏప్రిల్‌లో ఈ ధర సగటున రూ.105 పలికింది. దీంతో రోజువారీ ధరల సమీక్షను నిలిపివేయాలని చమురు కంపెనీలు నిర్ణయించాయి. రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధరను రూ.96.7, డీజిల్ ధరను రూ.89.62గా ఫ్రీజ్ చేశాయి. దీంతో అధిక చమురు ధరల నుండి వినియోగదారులకు ఊరట లభించింది. 2022 మార్చి-ఆగస్ట్ నెలల మధ్య కూడా బ్యారల్ చమురు ధర 100 డాలర్లకు పైనే నడిచింది. అయితే వినియోగదారులకు రక్షణ ఉచితంగా ఏమీ లభించలేదు. అది చమురు మార్కెటింగ్ కంపెనీల లాభదాయకతపై గణనీయమైన ప్రతికూల ప్రభావం చూపింది. అవి అధిక ధరకు చమురును కొనుగోలు చేసినప్పటికీ ఆ భారాన్ని వినియోగదారులపై మోపకుండా తామే భరించాయి.

లాభాల బాట పట్టినా...

2022 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో అంటే రెండు త్రైమాసికాలలో చమురు కంపెనీలు నష్టాలు చవిచూసినప్పటికీ ఆ తర్వాత లాభాల బాట పట్టాయి. వాస్తవానికి 2022-23లో మూడు చమురు కంపెనీలు రూ.19,086 కోట్ల లాభం పొందాయి. ఆయిల్ కంపెనీలు త్వరితగతిన కోలుకోవడానికి ప్రధాన కారణమేమంటే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పడిపోవడం మొదలైంది. 2023 జూన్ నాటికి చమురు ధరలు అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 35% మేర తగ్గాయి. కానీ ఈ ప్రయోజనాలేవీ వినియోగదారులకు దక్కలేదు. ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు రాలేదు. హమాస్-ఇజ్రాయిల్ ఘర్షణ నేపథ్యంలో అప్పటి నుండి చమురు ధరలు కొద్దో గొప్పో పెరుగుతూనే ఉన్నాయి. కానీ గరిష్ట స్థాయికి (116 డాలర్ల) చేరినప్పటి బ్యారల్ చమురు ధరతో పోలిస్తే 28% తక్కువగానే ఉన్నాయి. మన దేశంలో ఈ ఏడాది మార్చిలో లీటరు పెట్రోల్ ధరను రెండు రూపాయలు తగ్గించినప్పటికీ ఇంధన ధరల్లో మాత్రం మార్పు రాలేదు. ప్రారంభంలో అంతర్జాతీయ చమురు ధరల ప్రభావం వినియోగదారులపై పడకూడదని భావించి, అందుకు అనుగుణంగా ఆయిల్ కంపెనీలు చర్యలు తీసుకున్నప్పటికీ ఆ తర్వాత కాలంలో మాత్రం వాటి వైఖరిలో మార్పు వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా ఇక్కడ మాత్రం పెట్రోలియం ఉత్పత్తుల ధరలను ఏ మాత్రం తగ్గించలేదు.

సర్కారుకు డివిడెండ్లు

చమురు మార్కెట్ కంపెనీలు తాము ఆర్జించిన లాభాల్లో కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ ఇస్తామని హామీ ఇవ్వడంతో సర్కారు కూడా ప్రయోజనం పొందింది. 2022-23లో ప్రభుత్వానికి ఐఒసిఎల్ నుండి రూ.2,182 కోట్ల డివిడెండ్ అందగా 2023-24లో రూ.8,727 కోట్లు అందింది. అదే సమయంలో బిపిసిఎల్ నుండి పొందిన డివిడెండ్ రూ.460 కోట్ల నుండి రూ.2,413 కోట్లకు పెరిగింది.

సోరెన్‌కు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ : మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసులో ఇడి తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం నిమిత్తం తనకు బెయిల్ మంజూరుచేయాలని సోరెన్ ఇటీవల సుప్రీంను ఆశ్రయించారు. ఈసందర్భంగా కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. సోరెన్ పిటీషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన వెకేషన్ బెంచ్.. సోరెన్ పిటిషన్‌పై అసహనం వ్యక్తంచేసింది. ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయలేదన్న విషయాన్ని తమకు తెలపలేదని, కేసులో వాస్తవాలను దాచడానికి ప్రయత్నించారని ఆగ్రహించింది. ఈ పిటిషన్‌ను కొట్టివేస్తామని హెచ్చరించింది. దీంతో సోరెన్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

అలాగే, కేజ్రీవాల్ కేసుకు, సోరెన్ కేసుకు తీవ్ర వ్యత్యాసం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేజ్రీవాల్ ట్రయల్ కోర్టు నుంచి రెగ్యులర్ బెయిల్‌ను కోరలేదని, కేసులో అతనిపై ఎటువంటి న్యాయపరమైన ఆదేశాలు రాలేదని వెకేషన్ బెంచ్ ఎత్తి చూపింది.

కేరళ యూనివర్శిటీ సెనేట్‌కు గవర్నర్ నియామకాలను తిరస్కరించిన హైకోర్టు

తిరువనంతపురం : కేరళ యూనివర్శిటీ సెనేట్‌కు యూనివర్శిటీల ఛాన్సలర్ హోదాలో గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ చేసిన నియామకాలను రాష్ట్ర హైకోర్టు తిరస్కరించింది. ఆరు వారాల వ్యవధిలో కొత్త నామినీలను ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే ఇదే యూనివర్శిటీకి రాష్ట్ర ప్రభుత్వం చేసిన నామినేషన్లపై హైకోర్టు ఎలాంటి జోక్యం చేసుకోలేదు. ఆరిఫ్ ఖాన్ నామినేషన్లు కొట్టివేస్తూ చట్ట ప్రకారం నామినేషన్లు వేయడానికి ఛాన్సలర్‌కు ఎలాంటి అధికారం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఫైన్ ఆర్ట్స్, స్పోర్ట్స్, హ్యూమానిటీస్, సైన్స్ విభాగాల్లో ఆరిఫ్ ఖాన్ చేసిన నామినేషన్లను సవాల్ చేస్తూ నలుగురు విద్యార్థులు రెండు వేరు వేరు పిటీషన్ల ద్వారా హైకోర్టును ఆశ్రయించారు.

స్వతంత్ర దేశంగా పాలస్తీనాను గుర్తించాం

- నార్వే, ఐర్లాండ్, స్పెయిన్‌ల ప్రకటన
- ఖండించిన ఇజ్రాయిల్
- ఆ దేశాల నుండి రాయబారులు వెనక్కి

కొపెన్‌హేగన్ (డెన్మార్క్) : పాలస్తీనాను స్వతంత్ర దేశంగా తాము గుర్తిస్తున్నట్లు నార్వే, ఐర్లాండ్, స్పెయిన్‌లు బుధవారం ప్రకటించాయి. చారిత్రాత్మకమైన ఈ చర్య పట్ల పాలస్తీనియన్లలో తీవ్ర హర్షాతిరేకాలు వ్యక్తం కాగా, ఇజ్రాయిల్ తీవ్రంగా ఖండించింది. వెంటనే నార్వే, ఐర్లాండ్‌ల నుండి తమ రాయబారులను వెనక్కి రావాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

అయితే పాలస్తీనా గుర్తింపునకు సంబంధించి లాంఛనప్రాయమైన ప్రకటన ఈ నెల 28న వెలువడనుంది. గాజాపై ఇజ్రాయిల్ విరుచుకుపడి మారణహోమం సృష్టిస్తున్న నేపథ్యంలో వేలాదిమంది సామాన్యుల ఊచకోతపై అంతర్జాతీయంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పాలస్తీనియన్ల సుదీర్ఘకాల ఆకాంక్ష నెరవేరే దిశగా ఇదొక సానుకూల పరిణామం.

మొట్ట మొదట నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించకపోతే పశ్చిమాసియాలో శాంతి నెలకొనదని వ్యాఖ్యానించారు. స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడం పాలస్తీనా ప్రాథమిక హక్కు అన్నారు. సార్వభౌమాధికార దేశానికి ఉండే అన్ని హక్కులు పాలస్తీనాకు ఉంటాయి.. ఒక దేశంగా పాలస్తీనా వ్యవహరించేందుకు వుండాల్సిన కీలక అర్హతలను, ప్రమాణాలను కలిగివుందని ప్రపంచ బ్యాంక్ సైతం 2011లో పేర్కొందని అన్నారు.

ఐర్లాండ్ ప్రధాని సిమన్ హారిస్ ఇందుకు సంబంధించి ప్రకటన చేస్తూ, స్పెయిన్, నార్వేలతో కలిసి ఈ చర్య తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఐర్లాండ్‌కు, పాలస్తీనాకు ఇదొక చారిత్రక, కీలకమైన రోజని వ్యాఖ్యానించారు. రెండు దేశాల ఏర్పాటు ద్వారా పాలస్తీనా సమస్యను పరిష్కరించే దిశగా ఈ చర్య సాయపడుతుందని పేర్కొన్నారు. 1967 నాటి సరిహద్దుల ప్రాతిపదికగా పాలస్తీనా దేశాన్ని గుర్తించామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇతర దేశాలు కూడా తమ బాటను అనుసరించాలని భావిస్తున్నామన్నారు.

స్పెయిన్ కూడా ఈ రెండు దేశాల ఏర్పాటుకు మద్దతును పునరుద్ఘాటించింది. ఈ మేరకు స్పెయిన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఒక ప్రకటన చేశారు. ఈ మూడు యూరపు దేశాలు తీసుకున్న చర్యను జోర్డాన్ స్వాగతించింది.

మూడు యూరపు దేశాలు పాలస్తీనాకు మద్దతు పలకడంతో ఇజ్రాయిల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ఐర్లాండ్, నార్వే స్పెయిన్‌లోని తమ రాయబారులను వెనక్కి రావాలని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ ఆదేశించారు. .

గాజాలో పాలస్తీనీయులను ఇజ్రాయిల్ యథేచ్ఛగా ఊచకోత కోస్తుండడంపై యూరపు దేశాలు ఆగ్రహంగా ఉన్నాయి. పాలస్తీనాను గుర్తించాలన్న యోచనతో వున్నట్లు రెండు వారాల క్రితం అవి సంకేతాలిచ్చాయి. పశ్చిమాసియా ప్రాంతంలో శాశ్వత శాంతి నెలకొనాలంటే రెండు దేశాల ఏర్పాటే పరిష్కారమని స్పష్టం చేశాయి. తాజాగా ఈ మూడు దేశాలు తీసుకున్న నిర్ణయంతో ఇతర ఇయు దేశాలు కూడా పాలస్తీనాను గుర్తించే ప్రక్రియ వేగవంతం అవుతుందని ఆశిస్తున్నారు. ఇజ్రాయిల్‌ను ఏకాకిని చేసేందుకు ఐక్యరాజ్య సమితిలో ప్రయత్నాలకు వూతం లభిస్తుందని భావిస్తున్నారు.

ఇదిలావుండగా, గాజాలో యుద్ధాన్ని ఆపాలని ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని కోరుతూ ఇజ్రాయిల్‌వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలకు చెందిన విద్యావేత్తలు, అడ్మినిస్ట్రేటర్లు ఒక పిటిషన్‌పై సంతకాలు చేశారు.

గత 24గంటల్లో గాజాలో 62మంది పాలస్తీనియన్లు మరణించగా, 138మంది గాయపడ్డారు. ఉత్తర గాజాలో చివరగా పనిచేస్తున్న రెండు ఆస్పత్రులు అల్ అవదా, కమల్ అద్వాన్‌లను ఇజ్రాయిల్ బలగాలు చుట్టుముట్టాయని, లోపల 200మందికి పైగా రోగులు వున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఇప్పటివరకు గాజాలో 35,709మంది మరణించగా, 79,990మంది గాయపడ్డారు.

ఉద్యోగ కల్పనపై కహానీలు

- యువతకు అనేక అవకాశాలు కల్పించామన్న మోడీ
- అదేమీ లేదన్న యువతరం
- ఖాళీల భర్తీపై ఆసక్తి చూపని ప్రభుత్వం
- 8 శాతానికి చేరిన నిరుద్యోగ రేటు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 20న పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ నిరుద్యోగ సమస్యను ప్రస్తావించారు. 'గత ప్రభుత్వాలతో పోలిస్తే మా ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించింది. అది మా ట్రాక్ రికార్డ్' అని ఆయన చెప్పుకున్నారు. అయితే లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ ఇటీవల జరిపిన సర్వే సందర్భంగా అనేక మంది నిరుద్యోగం, ధరల పెరుగుదలపై తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశారు. 'గత ఐదు సంవత్సరాలతో పోలిస్తే ఇవాళ ఉద్యోగాలు పొందడం సులభమని మీరు భావిస్తున్నారా? కష్టమని అనుకుంటున్నారా?' అని అడిగిన ప్రశ్నకు ఇప్పుడు ఉద్యోగాలు సంపాదించడం కష్టంగా ఉన్నదని 62% మంది స్పష్టం చేశారు.

పెరగడమే కానీ తగ్గింది లేదు

సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఈ) సంస్థ నివేదిక ప్రకారం 2023-24లో 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో నిరుద్యోగ రేటు 8%గా ఉంది. అంతకుముందు రెండు సంవత్సరాల్లో ఈ రేటు 7.5-7.7% మధ్య నమోదైంది. ఉద్యోగాల కోసం వెతుకుతున్న నిరుద్యోగుల సంఖ్య 3.7 కోట్లకు చేరింది. గత ఏడు సంవత్సరాల్లో నిరుద్యోగ రేటు 8% పైగానే నమోదవుతోంది. 15-64 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో పనిచేస్తున్న కార్మికుల రేటు (ఎల్‌పిఆర్) 2016-17లో 46.2%గా ఉండేది. అయితే ఆ తర్వాతి మూడు సంవత్సరాల్లో ఈ రేటు 42-44%కి పడిపోయింది. 2020-21లో ఇది మరింత తగ్గి 40%కి చేరింది. అప్పటి నుండి ఈ రేటు తగ్గుతూనే ఉంది. 2023-24లో 40.4%గా ఉన్న ఎల్‌పిఆర్ రేటు 2016-17తో పోలిస్తే 5.8 పర్సంటేజ్ పాయింట్లు తగ్గింది. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే దేశంలో నిరుద్యోగ రేటు పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు.



45 సంవత్సరాల గరిష్ట స్థాయికి...

2019లో దేశంలో నిరుద్యోగం 45 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరుకుంది. అయితే ఈ వాస్తవాన్ని మోడీ ప్రభుత్వం బయటికి పొక్కనివ్వలేదు. ప్రభుత్వ చర్యను నిరసిస్తూ ఇద్దరు అధికారులు రాజీనామా కూడా చేశారు. కార్మిక మంత్రిత్వ శాఖ 2019లో విడుదల చేసిన వివరాల ప్రకారం 2017-18లో నిరుద్యోగ రేటు 6.1%గా ఉంది. ప్రభుత్వం ఎంతగా తొక్కిపట్టినప్పటికీ 2017 జూలై-2018 జూన్ కాలానికి సంబంధించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్‌ఎఫ్‌ఎస్) నివేదిక బయటికి వచ్చింది. నిరుద్యోగం భయానక స్థాయికి చేరిందని, గత 45 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిందని ఆ నివేదిక బయటపెట్టింది.

పొరుగు దేశాలతో పోలిస్తే...

ఇక యువతలో నిరుద్యోగ రేటు విషయానికి వస్తే అది దక్షిణాసియాలోని పొరుగు దేశాల్లో కంటే అధికంగా ఉంది. 2022లో విడుదలైన ప్రపంచబ్యాంక్ నివేదిక ప్రకారం మన దేశంలోని యువతలో నిరుద్యోగ రేటు 23.22%గా నమోదైంది. ఇది పాకిస్తాన్ (11.3%), బంగ్లాదేశ్ (12.9%), భూటాన్ (14.4%) దేశాల్లో రేటు కంటే చాలా ఎక్కువ. అదే సంవత్సరం చైనాలో నిరుద్యోగ రేటు 13.2%గా ఉంది.

యువతే అధికం

నిరుద్యోగుల్లో యువతే అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. 2022లో దేశంలోని మొత్తం నిరుద్యోగుల్లో నిరుద్యోగ యువత 82.9%గా ఉన్నారు. భారత్‌లో నిరుద్యోగ సమస్య యువతలోనే అధికంగా ఉన్నదని, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని విద్యావంతులైన యువత, మహిళల్లో ఇది ఎక్కువగా ఉన్నదని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) తన తాజా నివేదికలో తెలిపింది. మొత్తం నిరుద్యోగుల్లో విద్యావంతులైన యువత వాటా 2000లో 11.5% ఉంటే 2022 నాటికి 65.7%కి పెరిగింది. విద్యావంతులైన (సెకండరీ స్థాయి లేదా ఆ పైన) నిరుద్యోగ యువతలో పురుషుల (62.2%) కంటే మహిళలే (76.7%) ఎక్కువగా ఉన్నారు.

ఖాళీలూ రికార్డు స్థాయిలోనే...

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీల సంఖ్య రికార్డు స్థాయికి చేరింది. వాటిని భర్తీ చేయకపోగా అకస్మాత్తుగా రద్దు చేస్తున్నారు. సురక్షితమైన, గౌరవనీయమైన ఉపాధిని కల్పిస్తున్న సాయుధ దళాల్లో అగ్నివీర్ పేరిట నాలుగు సంవత్సరాల కాంట్రాక్ట్ సైనిక పథకాన్ని తీసుకొచ్చారు. ఈ అంశాన్ని ప్రధాని మోడీ తన ఎన్నికల ప్రచారంలో ఎక్కడా ప్రస్తావించడం లేదు. అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని రద్దు చేస్తామని ప్రతిపక్షాలు హామీ ఇచ్చాయి. ఉద్యోగ నియామకాల కోసం నిర్వహించే పరీక్షల్లో అనేక అవకతవకలు జరగడం యువతలో ఆగ్రహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా పరీక్షా పత్రాలు లీక్ అవడం పరిపాటిగా మారింది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వమే లోక్‌సభలో అంగీకరించింది. ఇదిలావుంటే ఐటీ రంగంలో ఉద్యోగాల్లో భారీ కోత పడుతోంది. నియామకాల సంస్థ ఫౌండిట్ తెలిపిన వివరాల ప్రకారం హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఐటీ కోసం ఆన్‌లైన్ నియామక కార్యకలాపాలు గత సంవత్సరం 18% మేర తగ్గిపోయాయి.

'ఇండియా' అధికారంలోకి వస్తే మోదానీ మెగా స్కామ్‌పై జెపిసితో దర్యాప్తు

- కాంగ్రెస్ హామీ

న్యూఢిల్లీ : ఎన్నికల తరువాత కేంద్రంలో ఇండియా వేదిక అధికారంలోకి వచ్చిన వెంటనే మోదానీ మెగా స్కామ్‌పై జాయింట్ పార్లమెంట్ కమిటీ (జెపిసి)తో దర్యాప్తు జరిపిస్తామని కాంగ్రెస్ బుధవారం హామీ ఇచ్చింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జై రాం రమేష్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. మోదానీ మెగా స్కామ్ గురించి ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసిసిఆర్‌పి) తన నివేదికలో వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నివేదికను కొన్ని మీడియా సంస్థలు ప్రచురించాయి. ఈ నివేదిక ప్రకారం 2014లో ఇండోనేషియా నుంచి తక్కువ నాణ్యత, అధిక బూడిదతో ఉన్న బొగ్గును అదానీ గ్రూపు తక్కువ ధరకు డజన్ల కొద్ది నౌకలతో కొనుగోలు చేసి, దానికి మూడు రెట్లు అధిక ధరకు తమిళనాడుకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్(టిఎన్‌జిఇడిసిఒ)కు విక్రయించింది. ఈ స్కామ్‌పై జెపిసి దర్యాప్తు చేస్తుందని జై రాం రమేష్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. 'ఈ స్కామ్ ద్వారా అదానీ గ్రూపు కనీసం రూ 3 వేల కోట్ల రూపాయిల అదనపు లాభాలను ఆర్జించింది. మరోవైపు ప్రజలు అధిక విద్యుత్ ధరలు, పెరిగిన వాయు కాలుష్యం బారిన పడ్డారు' అని జై రాం రమేష్ పేర్కొన్నారు. 'ప్రధాన మంత్రి సన్నిహితులు గత 10 ఏళ్లలో చట్టాలను ఉల్లంఘించడం, అత్యంత పేద భారతీయులను దోపిడీ చేయడం ద్వారా సంపన్నులుగా మారారు. వారి నేరాలకు ఇది మరొక ఉదాహరణ. వాయు కాలుష్యం వలన ఏటా 20 లక్షల మంది భారతీయులు మృతి చెందుతున్నారు. ప్రధాని మోడీ, అతని క్రోనీలకు అమృత్ కాల్ అయితే, మిగిలిన వారందరికీ విష కాల్' అని జైరాం రమేష్ విమర్శించారు. అదానిపై విచారణ జరగకుండా ప్రధాని మోడీ అడ్డుకంటూ వుండవచ్చుని, వచ్చే నెలలో ఇండియా వేదిక అధికారంలోకి వచ్చి తరువాత ఈ పరిస్థితి మారుతుందని పేర్కొన్నారు. బొగ్గు, విద్యుత్ పరికరాల అక్రమ ఓవర్ ఇన్‌వాయిస్, 20 వేల కోట్ల రూపాయిల అక్రమ ఆదాయాన్ని మళ్లీ అదానీ గ్రూపులకు మళ్లించడం వంటి 'మోదానీ మెగాస్కామ్'పై ఒక నెలలోనే జెపిసిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశ వినియోగదారులు చెల్లించిన అధిక విద్యుత్ ఛార్జీలు, విమానాశ్రయ రుసుములు ప్రధానమంత్రి సన్నిహితలను ధనవంతులు చేయడం వంటి ప్రతీ అంశంపైనా దర్యాప్తు జరుగుతుందని పేర్కొన్నారు.

బిజెపి, కాంగ్రెస్‌లకు ఇసి నోటీసులు

- కోడ్ ఉల్లంఘించొద్దని స్టార్ క్యాంపెయినర్లను ఆదేశించండి

న్యూఢిల్లీ : ఇంకా రెండు విడతలు మాత్రమే మిగిలి ఉండగా, ఎన్నికల సంఘం నింపాదిగా కోడ్ ఉల్లంఘనలపై స్పందించింది. అది కూడా నేరుగా మోడీ పేరును ప్రస్తావించకుండా బిజెపి అధ్యక్షుడికి హిత బోధ చేస్తూ నోటీసులిచ్చింది. ఆ ఒక్క పార్టీకే నోటీసులిస్తే బిజెపికి ఎక్కడ కోపం వస్తుందోనని పనిలో పనిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునికి కూడా నోటీసులు పంపింది. ఎన్నికల సంఘం వెన్నెముక లేనట్లుగా వ్యవహరిస్తోందని, బిజెపి ఆడమన్నట్టల్లా ఆడుతోందన్న విమర్శలకు ఇది మరింత బలం చేకూర్చేదిగా ఉంది. ఆ రెండు పార్టీలకు ఎన్నికల సంఘం బుధవారం వేరువేరుగా నోటీసులు జారీ చేసింది. ఎన్నికల నిబంధనలు అనుసరించాలని మీ స్టార్ క్యాంపెయినర్లను ఆదేశించాలని ఆ నోటీసుల్లో ఇసి కోరింది. సమాజంలో విభజనలు సృష్టించే ప్రకటనలు చేయకుండా స్టార్ క్యాంపెయినర్లను కట్టడి చేయాలని చెప్పింది. స్టార్ క్యాంపెయినర్లు తమ ప్రసంగాల్లో వాడే భాష హుందాగా ఉండేలా చూడాల్సిన బాధ్యత పార్టీ అధ్యక్షులదేనని తెలిపింది. ఇటీవల స్టార్ క్యాంపెయినర్లు చేస్తున్న ప్రసంగాలు గాడి తప్పుతున్నాయని చెప్పింది. ప్రచారాల్లో కుల, మత ప్రస్తావనలను తీసుకురావడం సరికాదని హితవు పలికింది. ఎన్నిసార్లు హెచ్చరించినా పార్టీల ప్రచారశైలిలో మార్పు రావడం లేదని, ఇకనైనా సరిదిద్దుకోవాలని నోటీసుల్లో ఇసి పేర్కొంది. ప్రచారాల్లో మతపరమైన అంశాలకు దూరంగా ఉండాలని ఇరు పార్టీలకు ఎన్నికల సంఘం సూచించింది. ముఖ్యంగా సమాజంలో విభజనకు దారితీసే ప్రసంగాలను చేయొద్దని తమ పార్టీ స్టార్ క్యాంపెయినర్లను ఆదేశించాలని బిజెపి అధ్యక్షులు జెపి నడ్డాకు రాసిన లేఖలో తెలిపింది. గత నెల రాజస్థాన్‌లోని బాన్స్వారాలో ప్రధాని మోడీ చేసిన ప్రసంగానికి వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 13న నడ్డాకు ఇసి నోటీసు జారీ చేసింది. ఆ తరువాత కూడా మోడీ మరింత విద్వేషాన్ని దట్టించి ప్రసంగాలు చేశారు.మోడీ బాహాటంగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, ఆయనపై చర్య ఎందుకు తీసుకోవడం లేదని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పలు మార్లు ఎన్నికల సంఘానికి లేఖలు రాశారు.

అమెరికన్ మాజీ కాంగ్రెస్ సభ్యుడిపై ఆంక్షలు విధించిన చైనా

బీజింగ్ : అమెరికా మాజీ కాంగ్రెస్ సభ్యుడు మైక్ గాలాగర్‌పై చైనా పలు ఆంక్షలను విధించింది. చైనాలోని ఆయన స్థిర, చరాస్తులను, ఇతర రకాల ఆస్తులను స్తంభింప చేసింది. చైనాలోకి ప్రవేశించడానికి లేదా వీసా జారి చేయాలంటూ చూసిన అభ్యర్థనను చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ నిరాకరించింది. చైనాలోని వ్యక్తులు, సంస్థలు ఏవీ కూడా ఆయనతో ఎలాంటి లావాదేవీలు జరపరాదని, ఆయనకు సహకరించరాదని పేర్కొంది. ఈ మేరకు విదేశాంగ శాఖ ఒక ప్రకటన జారీ చేసింది. విస్కాన్సిన్ రిపబ్లికన్ సభ్యుడైన గాలాగర్ చైనా పోటీపై ఏర్పాటు చేసిన ప్రతినిధుల సభ సెలక్ట్ కమిటీ మాజీ చైర్మన్. చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేలా ఇటీవలి కాలంలో ఆయన మాటలు, చేతలు వున్నాయని విదేశాంగ శాఖ ప్రకటన పేర్కొంది. చైనా సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను, ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని పేర్కొంది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా విదేశీ వ్యతిరేక ఆంక్షల చట్టం ప్రాతిపదికన ఈ చర్యలు తీసుకున్నట్లు చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. మంగళవారం నుండి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది. కాంగ్రెస్ జూనియర్ సభ్యుల్లో ఒకరైన గాలాగర్ తరచుగా చైనాను లక్ష్యంగా చేసుకునే చర్చలు, కార్యక్రమాల్లో పాల్గొంటూ వుంటారని, తన రాజకీయ కెరీర్‌లో ఎదుగుదల కోసమే ఇలా చేస్తూంటారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. 2017 నుండి ఆయన అనేక చైనా సంబంధిత బిల్లులను ప్రతిపాదించారు.

లక్షలాదిమందితో ఇరాన్ అధ్యక్షుని అంతిమయాత్ర

టెహరాన్ : అనుమానాస్పద రీతిలో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసి అంతిమయాత్ర బుధవారం జరిగింది. లక్షలాదిమంది ప్రజలు ఈ అంతిమయాత్రలో పాల్గొని తమ ప్రియతమ నేతకు కడసారిగా నివాళులర్పించారు. తొలుత ఈ ప్రమాదంలో మరణించిన వారి భౌతిక కాయాలను టెహరాన్ యూనివర్శిటీలో వుంచారు. ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేని నేతృత్వంలో అక్కడ సంస్మరణ సభ జరిగింది. రైసి గురించి మాట్లాడుతూ ఖమేని ప్రార్థనలు చేశారు. ఆయన వెళ్ళిన వెంటనే ప్రజలను లోపలకు అనుమతించారు. ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడు మహ్మద్ మొఖ్బర్ ఆ శవపేటిక పక్కనే నిలబడి కంటతటి పెట్టడం కనిపించింది. అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ శవపేటికను బయట ట్రక్కుపై ఎక్కించిన అనంతరం అంతిమయాత్ర ప్రారంభమైంది. భారత్ తరపున ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్ ఈ సంస్మరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన రైసికి ఇతర నేతలకు నివాళులు అర్పించారు. హమాస్ నేత ఇస్మాయిల్ హనియె కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, సంతాపం తెలియచేసేందుకు పాలస్తీనియన్ల తరపున తానిక్కడకు వచ్చానని చెప్పారు. రంజాన్ సమయంలో టెహరాన్‌లో రైసితో జరిపిన సమావేశం గురించి ఆయన గుర్తు చేసుకున్నారు. పాలస్తీనా సమస్య ముస్లిం దేశాల్లో కీలకమైనదిగా వుందని ఆయన వ్యాఖ్యానించారని చెప్పారు. తమ మాతృభూమి విముక్తి కోసం పోరాడుతున్న పాలస్తీనియన్ల పట్ల ముస్లిం ప్రపంచం తన బాధ్యతలను నిర్వర్తించాలని కోరారు.

అదానీ బొగ్గు కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

(దాదాపు రూ.566 కోట్లు) పెంచి చూపించిన ఆరోపణకు సంబంధించి అదానీపై విచారణ జరిపింది.

అదానీ 2013లో ఇండోనేషియాలో 28 డాలర్లకు ఒక్క టన్ను కొనుగోలు చేయగా.. దీన్ని భారత్‌లో 92 డాలర్లకు విక్రయించిందని ఎఫ్‌టి రిపోర్ట్ చేసింది. అదే బొగ్గులో కిలోకు 3,500 కేలరీలు ఉండగా..దాని నాణ్యతను 6,000 కేలరీలకు పెంచి చూపింది. తక్కువ గ్రేడ్ రకం బొగ్గును అధిక నాణ్యత కలిగిన బొగ్గుగా చూపించడంతో పాటుగా ధరను అమాంతం పెంచి ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు అంటగట్టడం ద్వారా అదానీ కంపెనీ భారీగా లబ్ధి పొందిందని ఎఫ్‌టి విశ్లేషించింది. ఆ బొగ్గు వాడకంతో కాలుష్యం బాగా పెరిగింది. మరోవైపు విద్యుత్ కంపెనీల ఆదాయాలు కరిగిపోయాయి. ఉత్పత్తి వ్యయాలు పెరగడంతో ఆ భారం ఆటోమెటిక్‌గా ప్రజలపై పడిందని స్పష్టమవుతోంది.

వేసవి విడిది

మల్లెలాంటి మనసు

దేవగిరి పట్టణపు చివరన హంపానగర్ ఉంది. అక్కడి ఉన్నత పాఠశాలలో చదువుతున్న మందాకిని, హారతి మంచి స్నేహితులు. మందాకిని ఇంటి దగ్గర పెద్ద మందార చెట్టు ఉంది. మందారం చెట్టు సంవత్సరమంతా పూలతో కళకళలాడుతూ ఉండేది. ఆ పూలను రోజూ మందాకిని పెట్టుకునేది. ఒక్క రోజు కూడా స్కూల్లో ఎవరికీ తెచ్చి ఇచ్చేది కాదు.

ఒకసారి ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం రోజున హారతి, మందాకిని ఇంటికి వెళ్లి రెండు పూలు అడిగింది. మందాకిని ససేమిరా అంది. స్నేహితురాలు అలా అనేసరికి హారతి చాలా రోజులు బాధపడింది.

రెండేళ్ళు గడిచాయి. ఆ రోజు జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం వేడుకకు అందరూ వచ్చారు. అప్పుడు హారతి జడ నిండుగా మల్లెపూలు పెట్టుకుని వచ్చింది. వస్తూ వస్తూనే తనతో ఓ బుట్ట నిండా మల్లె పూలు తెచ్చి నాయకుల ఫొటోల ముందు పోసింది. కొన్ని మాలలు తీసి టీచర్లకు ఇచ్చింది. స్నేహితులకు కూడా తలా ఒకటి పంచిపెట్టింది. జెండా పండుగ గుర్తుగా హారతి వాళ్ళమ్మ ఇచ్చిన మల్లెతీగలను బడిలో అందరికీ పంచింది. అప్పుడే వచ్చిన మందాకినికి కూడా దాచి ఉంచిన పూల మాల ఒకటి ఇచ్చింది. అందరి తలల్లో తురిమిన మల్లెపూల మాలలు, ఫొటోల ముందు కుమ్మరించిన పూలను చూసి హారతి చేసిన పనిని మందాకిని గుర్తించింది. అందరూ తనను అభినందిస్తుంటే, తన తప్పును తెలుసుకొని సిగ్గుతో తలదించుకుంది. ఇక నుంచి తాను కూడా మందార పూలను అందరికీ ఇవ్వాలని అనుకుంది.

- ఎ.హేమావతి రాజన్న,
94416 64931.

స్వచ్ఛ మనసు మాది

స్వచ్ఛ మనసు మాది
కుళ్ళు కుతంత్రాలు మాలో లేవు
పగలు ప్రతీకారాలు అసలే లేవు
మోసాలు చాడీలు తెలియవు
కుల మత బేధాలు మాలో ఉండవు
దుర్మార్గాలు తొలగిస్తాం
సన్మార్గంలో పయనిస్తాం
మంచి మాటలు వింటాం
చెడుకు దూరంగా ఉంటాం
సమతా మమతా కలిగి ఉంటాం
సహకారం పెంచుకుంటాం
సౌభ్రాతృత్వంతో ముందుకు సాగుతాం
సమానత్వమే మేము కోరుకుంటాం
దురాభిప్రాయాలు చేరిపేస్తాం
పారదర్శకత మా లక్ష్యం
అందరి పట్ల స్వచ్ఛ మనసే మేము చూపిస్తాం

- కనుమ ఎల్లారెడ్డి,
అమెరికా, 93915 23027.

బొమ్మలు





పి. ఎస్తేర్ రాణి,
10వ తరగతి, జెడ్‌పి హైస్కూల్,
బెల్‌గల్ మండలం, కోడుమూరు తాలూక,
కర్నూలు జిల్లా.





ఈమని. వైశాలి,
4వ తరగతి, సెయింట్ అల్ఫోన్సా హై స్కూల్,
చిలువూరు, గుంటూరు జిల్లా.

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా

వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.

మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com

– ఎడిటర్

జీవన the family

JEEVANA

జీవన సౌరభం

జీవితంలో ప్రతిరోజు నిన్నటి కన్నా ఎక్కువ విషయాలు నేర్చుకుంటూ ఉండాలి.

ఉద్వేగం కాదు ; మా బతుకే కీలకం!

పనుల్లేవని, ధరలు మండిపోతున్నాయని, కుళాయిలో నీళ్లు రావడం లేదని, డ్రైనేజీలు బాగు చేయలేదని, రోడ్లు వేయలేదని, పరీక్షల్లో అవకతవకలు జరిగాయని.. ఇలా ఎన్నో కారణాలతో ఎన్నో చోట్ల ఎంతోమంది సతమతమవుతూనే ఉంటారు. అయితే ఎంతమంది తమ భావాలను నిర్భయంగా బయటికి చెప్పగలుగుతున్నారు? ఎంతమంది ఇతరత్రా ఉద్వేగ రాజకీయాలకు గురవ్వకుండా– తమ బతుకే కీలకంగా తమ వాణిని బలంగా వినిపిస్తున్నారు! సరైన కాలంలో సరిగ్గా స్పందిస్తేనే పరిస్థితుల్లో మార్పులు వస్తాయి. ఎన్నికల వేళ ... ఏ అంశం తమను ప్రభావితం చేస్తుందో వివరిస్తున్న కొంతమంది ఓటర్ల గళం విందాం.

ఉపాధి పోయింది!

పశ్చిమ బెంగాల్‌కి చెందిన 40 ఏళ్ల అమిరుల్ లష్కర్‌కు మూడు నెలలుగా ఏ పనీ లేదు. అతని స్వస్థలమైన మానిక్‌పూర్‌లో ఉన్న డెల్టా జ్యూట్ మిల్ మూతబడి అతడి ఉపాధి పోయింది. 'దీనివల్ల ఇల్లు గడవడం చాలా కష్టంగా తయారైంది. నెలల పిల్లకు సరైన పోషణ లేక శుష్కించిపోతోంది. ఈ పరిస్థితులు ఏడాదిలో మూడు, నాలుగుసార్లు ఎదురవుతున్నాయి. పని లేకుండా కొన్ని నెలల పాటు ఉండిపోతున్నాం. ఈ పరిస్థితుల్లో వేరే ప్రాంతానికి వెళ్లిపోదామనుకుంటున్నాను' అంటున్న లష్కర్, వామపక్ష ప్రభుత్వం ఉన్నప్పటి పరిస్థితిని గుర్తు చేసుకున్నాడు. 'సిపి(ఐ)ఎం అధికారంలో ఉన్నప్పుడు ఇలా పనుల్లేకుండా ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. స్థానిక నాయకులు మా బాగోగులు పట్టించుకునేవారు. మిల్లు పునరుద్ధరణకు ప్రయత్నాలు చేసేవారు. ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీ అలాంటి పని చేయడం లేదు. ఆ పార్టీ నాయకులు రాష్ట్రమంతా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. మా ప్రాంతానికి మాత్రం ఒక్కరూ రావడం లేదు. మేము తిరగబడతామేమోనని వాళ్ల భయం. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమై మురుగులో జీవిస్తున్నాం. సిపిఎం ఉన్నప్పుడు పరిస్థితి ఇలా లేదు. స్థానిక సమస్యలను పరిష్కరించేవారు. అధికారంలో లేకపోయినా ఇప్పటికి ఎన్నోసార్లు సిపిఎం నాయకులు మా ప్రాంతానికి అనేక సార్లు వచ్చారు. ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థి కూడా మమ్మల్ని కలిసి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మమ్మల్ని పట్టించుకునే వారే అధికారంలోకి రావాలి. అందుకే ఈసారి నా ఓటు సిపిఎంకే వేస్తాను' అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. అతడి లాంటి వాళ్ల ఆ ప్రాంతంలో అనేకమంది కనిపిస్తున్నారు.

ఇల్లు కూల్చివేత ..

దేశ రాజధాని ఢిల్లీలో రెండేళ్ల క్రితం బుల్డోజర్ సంస్కృతి నడిచింది. ఏవేవో కారణాలు చెప్పి వేలాదిమంది పేదల ఇళ్లను కూల్చివేశారు. 'బుల్డోజర్ మా ఇంటిని కూల్చివేసినప్పుడు ఆపేందుకు ఎవరూ రాలేదు. కూల్చివేతల్లో ఎన్నో కోల్పోయాం. తలదాచుకునే చోటు లేదు. చేసే పని పోయింది. ఇంతవరకు మాకు పునరావాసం కల్పించలేదు. అందుకే ఇళ్లు కూల్చిన బిజెపికి, ఏమీ చేయకుండా కూర్చొన్న ఆప్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నాను' అని తన నిర్ణయాన్ని స్పష్టంగా చెబుతోంది 21 ఏళ్ల రేణు. ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా బిజెపి ప్రభుత్వం చేసిన ఈ దుర్మార్గానికి ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయి. జీ 20 సదస్సులని, యమునా నది ప్రక్షాళన పేరుతో, రోడ్ల విస్తరణ నెపంతో ఇలా ఏవేవో కారణాలతో కూల్చివేతలు చేశారు.

నిరుద్యోగ గ్రామీణం

ఉత్తరప్రదేశ్‌లో వందలమంది విద్యార్థులు మొదటిసారి ఓటు వేసేందుకు సిద్ధమయ్యారు. ఎంతోమంది పట్టభద్రులు ఉద్యోగ నియామకాలు లేక ఇంటికే పరిమితమయ్యారు. మరికొంతమంది పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన సందీప్ కుమార్ (23), ప్రభుత్వ రంగ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు కేంద్రమైన ప్రయాగ్‌రాజ్ చేరుకున్నాడు. అతడు ఓ రైతు కుమారుడు. సుమారు 300 కిలోమీటర్ల దూరం నుంచి ప్రయాగరాజ్‌కు వచ్చాడు. 'ఇంత ప్రయాస ఎందుకు పడుతున్నానంటే.. నా కుటుంబ ఆర్థిక పరిస్థితి ఏమంత బాగోలేదు. ప్రైవేటు రంగ ఉద్యోగం సాధిస్తే పరిస్థితులు ఏమీ మారవు. అందుకే ప్రభుత్వ రంగ ఉపాధి కోసం కష్టపడుతున్నాను. 2014 ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాలు ఇంతవరకు కల్పించలేదు. అందుకే ఈసారి నా ఓటు బీజేపీకి వేయను' అని చెబుతున్నాడు. యుపిఎస్‌సి పరీక్షలకు సిద్ధమవుతున్న 28 ఏళ్ల దీపక్ కుమార్ (28)దీ అదే మాట. 'మా ఊళ్లో ఎంతోమంది పట్టభద్రులు రోజు కూలీలుగా మారిపోయారు. ఉద్యోగం రాకపోతే నాది కూడా అదే పరిస్థితి. ఉద్యోగం లేక నా స్నేహితుల్లో చాలామంది ఎప్పుడూ నిరాశగా ఉంటారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రాల్లో లేనివిధంగా ఇక్కడ పేపర్ లీకేజీలు ఎక్కువ. కోచింగ్ సెంటర్ల నిర్వహణ కూడా అంతంతమాత్రంగానే ఉంది.' అంటూ ఆవేదన వ్యక్తంచేశాడు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఈ యువ ఔత్సాహికులకు జీవనోపాధి, భద్రత పెద్ద సమస్యగా తయారైంది. ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారం పెను దుమారం రేపుతోంది.

... ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్కరు ఒక్కో సమస్యతో సతమతం అవుతున్నారు. ఈ పరిస్థితులకు కారణమెవరు?' అన్న ప్రశ్నకు జవాబు వెతుకుతున్నారు. ఆ సమస్యకు పరిష్కారంగా ఓటుతో సమాధానం చెప్పాలని యోచిస్తున్నారు.

ఇక అదనపు ఆటలు ఉండవు

తెలంగాణ థియేటర్ల సంఘం



ఇతర రాష్ట్రాలు, దేశాల తరహాలోనే టాలీవుడ్‌లో కూడా ఎగ్జిబిటర్లకు నిర్మాతలు పర్సంటేజీలు ఇవ్వాలని తెలంగాణ థియేటర్ల సంఘం అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. అద్దె ప్రతిపాదికన ఇక నుంచి సినిమాలు ప్రదర్శించబోమని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్ల మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్టీప్లెక్స్ తరహాలోనే నిర్మాతలు పర్సంటేజీలు చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని అన్నారు. లేదంటే థియేటర్ల మూత తప్పబోదని అన్నారు. గత పదేళ్లలో 2 వేల సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూతపడినట్టు చెప్పారు. "కొంతమంది డిస్ట్రిబ్యూటర్లు సినిమా వ్యాపారాన్ని జూదంగా మార్చారు. బెనిఫిట్ షోలు, అదనపు ఆటలతో మోసాలకు పాల్పడుతున్నారు. ఇకనుంచి బెనిఫిట్ షోలు, అదనపు ఆటలు ప్రదర్శించం. అన్ని సినిమాలూ పర్సంటేజీ విధానంలోనే ప్రదర్శిస్తాం. జులై 1 వరకు సినీ నిర్మాతలకు గడువు ఇస్తున్నాం. ఈలోపు వారు మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం. కల్కి, పుష్ప2, గేమ్ చేంజర్, భారతీయుడు చిత్రాలను మాత్రం పాత పద్ధతిలోనే ప్రదర్శిస్తాం." అనివిజయేందర్ రెడ్డి వివరించారు.

ప్రమోషన్‌లో 'కల్కి'

సినిమాను తీయడం ఒకెత్తు అయితే.. ఆ సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడం మరో ఎత్తు. అందుకే ప్రమోషన్స్ విషయంలో మేకర్స్ చాలా జాగ్రత్తగా ఉంటారు. ప్రేక్షకులను రీచ్ అయ్యేందుకు అందొచ్చే ఏ చిన్న అవకాశాన్ని వదులుకోరు. ఇప్పుడు కల్కి టీం ప్రమోషన్స్ ప్రారంభించింది. దాదాపు రూ.600 కోట్ల బడ్జెట్‌తో నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె ఇతర కీలక పాత్రలు పోషించారు. జూన్ 27న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతుంది.

షారుక్ ఖాన్‌కు స్వల్ప అస్వస్థత

అహ్మదాబాద్: బాలీవుడ్ నటుడు, కోల్‌కతా నైట్‌రైడర్స్ సహ యజమాని షారుక్ ఖాన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు.కోల్‌కతా, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మంగళవారం రాత్రి జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన షారుక్.. వడదెబ్బతో బుధవారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి అనంతరం డిశ్చార్జి చేశారు. షారుక్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారంటూ వచ్చిన వార్తలపై ఆయన అభిమానులు ఆందోళన చెందారు. 'కింగ్ ఖాన్‌కు ఏమైంది?' 'ఆయన త్వరగా కోలుకోవాలి' అంటూ సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారు. పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిశాక ఊపిరి పీల్చుకున్నారు.



మోదీ బయోపిక్‌లో నటించను : సత్యరాజ్

'నేను నరేంద్ర మోదీ బయోపిక్‌లో నటించనున్నట్లు వస్తోన్న వార్తల్లో నిజం లేదు. అవి చూసి నేనూ ఆశ్చర్యపోయాను. ఇలాంటి రూమర్స్ నమ్మకండి. ఆ చిత్రం కోసం ఇప్పటివరకు నన్నెవరూ సంప్రదించలేదు. సోషల్ మీడియాలో ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేయకండి. ఒకవేళ ఈ బయోపిక్ కోసం ఎవరైనా సంప్రదించినా నేను అంగీకరించను. ఎందుకంటే ఇది నా సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉండే అవకాశం ఉంది.' అని నటుడు సత్యరాజ్ స్పష్టంచేశారు.

జూన్‌లో వస్తున్న 'యక్షిణి' !

ఆర్కా మీడియా వర్క్స్, డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ది సూపర్ హిట్ కాంబినేషన్‌లో 'యక్షిణి' మరో ఆసక్తికర వెబ్ సిరీస్ ప్రేక్షకులను అలరించనుంది. ఈ సంస్థల కలయికలో గతంలో పరంపర, పరంపర 2 వెబ్ సిరీస్‌లు వచ్చిన విషయం తెలిసిందే. యక్షిణి వెబ్ సిరీస్‌ను శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మిస్తున్నారు. వేదిక, మంచు లక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకత్వం తేజ మార్ని. జూన్‌లో తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీలో 'యక్షిణి' వెబ్ సిరీస్ స్ట్రీమింగ్‌కు రాబోతోంది.

కొత్త సినిమా పోస్టర్ విడుదల

పేపర్ బాయ్ ఫేం డైరెక్టర్ జయశంకర్ 'అరి' అనే మరో డిఫరెంట్ కాన్సెప్ట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇందులో సూర్య పురిమెట్ల ఓ ప్రధాన పాత్ర పోషించారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ మూవీ విడుదలకు ముందే.. సూర్య పురిమెట్ల మరో ప్రాజెక్ట్‌ని పట్టాలెక్కించారు. ఈ చిత్రానికి జయశంకర్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. సుందర్ పాలుట్ల దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. తాజాగా ఈ మూవీ పోస్టర్‌ని తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వినయ్, నిర్మాత తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, పవన్ తదితరులు పాల్గొన్నారు.

క్వాలిఫయర్ రౌండ్‌కు రాజస్థాన్

- బెంగళూరుపై నాలుగు వికెట్ల తేడాతో గెలుపు
- ఫైనల్ బెర్త్‌కు రేపు సన్‌రైజర్స్‌తో ఢీ

అహ్మదాబాద్: ఎలిమినేటర్–1లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు రాణించడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు అవేశ్ ఖాన్(3/44), అశ్విన్(2/19)లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బెంగళూరు జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని రాజస్థాన్ 19 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టపోయి 174 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ జైస్వాల్(45), టామ్ కోలర్(20)కి తోడు రియాన్ పరాగ్(36), హెట్‌మైర్(26) రాజస్తాన్ గెలుపులో కీలకపాత్ర పోషించారు.

టాస్ ఓడిన బెంగళూరును ట్రెంట్ బౌల్ట్ కట్టడి చేశాడు. తొలి ఓవర్లో రెండు, మూడో ఓవర్లో 3 పరుగులే ఇచ్చాడు. అయితే.. సందీప్ శర్మ, అవేశ్ ఖాన్‌లను టార్గెట్ చేసిన కోహ్లీ(33), డూప్లెసిస్(17)లు బౌండరీలతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. దాంతో, శాంసన్ పవర్ ప్లేలోనే బౌల్ట్‌కు మూడో ఓవర్ వేసిన బౌల్ట్ బెంగళూరు కెప్టెన్ డూప్లెసిస్‌ను ఔట్ చేసి రాజస్థాన్‌కు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత కామెరూన్ గ్రీన్(27), పాటిదార్(34)లు ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కానీ, స్పిన్నర్ అశ్విన్ వరుస బంతుల్లో గ్రీన్(27), గ్లెన్ మ్యాక్స్‌వెల్(0)లను పెవిలియన్ పంపి బెంగళూరును దెబ్బతీశాడు. వికెట్ కీపర్ దినేశ్ కార్తిక్(11) నిరాశపరిచినా.. చివర్లో మహిపాల్ లొమ్‌రోర్(32) బౌండరీలతో చెలరేగాడు. స్వప్నిల్ సింగ్ రాణించడంతో స్కోర్‌బోర్డు పరుగెత్తింది. స్వప్నిల్ సింగ్(9) మెరుపులతో రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు నష్టపోయి 172పరుగులు చేసింది. ఆవేశ్‌ఖాన్‌కు మూడు, అశ్విన్‌కు రెండు, సందీప్ శర్మ, బౌల్ట్, చాహల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జైస్వాల్(45), టామ్(20) తొలి వికెట్‌కు 46పరుగులు జోడించారు. ఆ తర్వాత కెప్టెన్ సంజు(17) నిరాశపరిచినా.. రియాన్(36) ఆదుకున్నాడు. ధృవ్ జురెల్(8) త్వరగా ఔటైనా.. హెట్‌మైర్(26), రువాన్ పావెల్(16నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు. బెంగళూరు బౌలర్లు సిరాజ్‌కు రెండు, ఫెర్గుసన్, కరణ్ శర్మ, గ్రీన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ గెలుపులో రాజస్తాన్ జట్టు క్వాలిఫయర్–2లోకి ప్రవేశించింది. 24న చెన్నై వేదికగా సన్‌రైజర్స్–రాజస్తాన్ జట్ల మధ్య క్వాలిఫయర్–2 మ్యాచ్ జరగనుంది.

స్కోర్‌బోర్డు...

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్ : విరాట్ కోహ్లి (సి)సబ్ ఫెర్రీరియా (బి)చాహల్ 33, డుప్లెసిస్ (సి)రువాన్ పావెల్ (బి)బౌల్ట్ 17, గ్రీన్ (సి)రువాన్ పావెల్ (బి)అశ్విన్ 27, రజత్ పటీధర్ (సి)రియాన్ పరాగ్ (బి)ఆవేశ్ ఖాన్ 34, మ్యాక్స్‌వెల్ (సి)జురెల్ (బి)అశ్విన్ 0, లోమ్రోర్ (సి)రువాన్ పావెల్ (బి)ఆవేశ్ ఖాన్ 32, దినేశ్ కార్తీక్ (సి)జైస్వాల్ (బి)ఆవేశ్ ఖాన్ 11, స్వప్నిల్ సింగ్ (నాటౌట్) 9, కరణ్ శర్మ (సి)రువాన్ పావెల్ (బి)స్వప్నిల్ శర్మ 5, అదనం 4. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 172పరుగులు. **వికెట్ల పతనం:** 1/37, 2/56, 3/97, 4/97, 5/122, 6/154, 7/159, 8/172 **బౌలింగ్:** బౌల్ట్ 4-0-16-1, సందీప్ 4-0-48-1, ఆవేశ్ ఖాన్ 4-0-44-3, అశ్విన్ 4-0-19-2, చాహల్ 4-0-43-1.

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)కార్తీక్ (బి)గ్రీన్ 45, టామ్ కోహ్లర్ (బి)ఫెర్గుసన్ 20, సంజు శాంసన్ (స్టంప్)కార్తీక్ (బి)కరణ్ శర్మ 17, రియాన్ పరాగ్ (బి)సిరాజ్ 36, ధృవ్ జురెల్ (రనౌట్)కోహ్లి/గ్రీన్ 8, హెట్‌మైర్ (సి)డుప్లెసిస్ (బి)సిరాజ్ 26, రువాన్ పావెల్ (నాటౌట్) 16, అశ్విన్ (నాటౌట్) 0, అదనం 6. (19ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 174పరుగులు. **వికెట్ల పతనం:** 1/46, 2/81, 3/86, 4/112, 5/157, 6/160 **బౌలింగ్:** సిమ్రన్‌జీత్ సింగ్ 2-0-19-0, సిరాజ్ 4-0-33-2, యశ్ దయాల్ 3-0-37-0, ఫెర్గుసన్ 4-0-37-1, కరణ్ శర్మ 2-0-19-2, గ్రీన్ 4-0-28-1.

హాకీలో శుభారంభం

షూటౌట్‌లో అర్జెంటీనాపై గెలుపు

శ్రీజేశ్

బ్యూనస్‌ఎయిర్(అర్జెంటీనా): యూరోప్ పర్యటనలో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ 2023-24 సీజన్‌లో భారత్ శుభారంభం చేసింది. పురుషుల హాకీజట్టు అర్జెంటీనాపై గెలుపొందగా.. మహిళల జట్టు అర్జెంటీనా చేతిలో చిత్తుగా ఓడింది. బుధవారం అర్జెంటీనాతో జరిగిన తొలి మ్యాచ్‌లో పురుషుల జట్టు షూటౌట్‌లో 5-4గోల్స్‌తో గెలిచింది. నాలుగు క్వార్టర్లు ముగిసేసరికి భారత్-అర్జెంటీనా జట్లు 2-2గోల్స్‌తో సమంగా నిలిచాయి. షూటౌట్‌లో భారత్ 5-4గోల్స్ తేడాతో అర్జెంటీనాను ఓడించింది. భారతజట్టు గెలుపులో గోల్‌కీపర్ శ్రీజేష్ కీలకపాత్ర పోషించాడు. సడెన్ డెత్‌లో శ్రీజేశ్ ఒక గోల్‌ను అడ్డుకోవడంతో భారత్‌కు విజయం వరించింది. ఈ పర్యటనలో భాగంగా భారతజట్టు 26న బెల్జియంతో తలపడనుంది.

నిరాశపరిచిన మహిళలు..

ఇక భారత మహిళలజట్టు అర్జెంటీనా చేతిలో చిత్తుగా ఓడింది. ఈ పర్యటనలో భాగంగా బుధవారం అర్జెంటీనాతో తలపడిన భారత మహిళల హాకీ జట్టు 0-5గోల్స్ తేడాతో పరాజయాన్ని చవిచూసింది. అర్జెంటీనా తరపున జులీటా(53, 59వ ని.), అగస్టినా(13వ ని.), వలెంటినా(24వ ని.), విక్టోరియా(41వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. భారత మహిళలజట్టు నూతన కోచ్ హరేంద్ర సింగ్ నేతృత్వంలో తొలిసారి యూరప్ పర్యటనకు వచ్చింది.

అమెరికా సంచలనం

బంగ్లాదేశ్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలుపు

హూస్టన్(అమెరికా): టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యమిస్తున్న అమెరికా జట్టు బంగ్లాదేశ్‌కు ఝలక్ ఇచ్చింది. మూడు టి20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన తొలి టి20లో అమెరికా జట్టు ఐదు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 153పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని అమెరికా జట్టు 19.3ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 156పరుగులు చేసి గెలిచింది. తొలుత బంగ్లా స్వల్ప వ్యవధిలోనే ఓపెనర్లు లిటన్ దాస్(14), సౌమ్య సర్కార్(20), కెప్టెన్ నజ్ముల్ హుసేన్ షాంటో(3) వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో తౌహిద్ హృదోయ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. 47 బంతుల్లో 58 పరుగులతో రాణించాడు. మరోవైపు మహ్మదుల్లా(31) కూడా బ్యాట్ ఝుళిపించడంతో బంగ్లాదేశ్ నిర్ణీత 20ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. ఛేదనలో అమెరికా బ్యాటర్లు స్టీవెన్ టేలర్(28), ఆండ్రీస్ గౌస్(23), కోరే ఆండర్సన్(34నాటౌట్), హర్మీత్ సింగ్(33నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. ముఖ్యంగా హర్మీత్ కేవలం 13 బంతుల్లోనే 33 పరుగులు సాధించి జట్టును గెలుపు తీరాలకు చేర్చి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. దీంతో అమెరికా 19.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసింది. ఇక మూడు టి20ల సిరీస్‌లో అమెరికా 1-0 ఆధిక్యతలో నిలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68